RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 365 బుధవారం 28 జనవరి 2026 పేజీలు : 4 వెల : రూ. 2.00

## కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

న్యూఢిల్లీ : కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హోం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం.



# 'మేడారానికి' వేళాయె!

## నేటి నుండే సమ్మక్క సారలమ్మ మహాజాతర!

వరంగల్ : మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. బుధవారం నుంచి మొదలయ్యే జాతరకు లక్షలాది భక్తులు తరలిరానుండడంతో అధికారులు అన్నిపనులు పూర్తి చేశారు. వరంగల్ నుంచి మేడారం వరకు వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని పోలీసు బందోబస్తును పెంచారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలను చేపట్టారు. ఇప్పటికే ప్రతి రోజు వేలాది వాహనాల ద్వారా లక్షలాది మంది భక్తులు తరలివస్తుండటంతో భారీ ఏర్పాట్లను చేశారు.

**బుధవారం నుంచి జాతర...** మేడారం సమ్మక్క సారలమ్మ బుధవారం నుంచి మొదలుకానుంది. బుధవారం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలకు చేరుకోనున్నారు. గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెల పై ప్రతిష్ఠిస్తారు. వన దేవతలు గద్దెలకు చేరగానే భక్తుల మొక్కులు మొదలవుతాయి. శుక్ర, శనివారాలు భక్తులు మొక్కులు చెల్లిస్తారు. శనివారం సాయంత్రం వనదేవతలు గద్దెల నుంచి వనాలకు చేరుకోవడంతో జాతర ముగియనుంది.

**ఇతర రాష్ట్రాల నుంచి తరలిరానున్న ఆదివాసులు..** ఈ జాతరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఆదివాసులు తరలిరానున్నారు. వనదేవతలను తీసుకువచ్చేందుకు ఇప్పటికే యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేసింది. పూజారులతో మాట్లాడటంతో పాటు కావాల్సిన సదుపాయాలను కల్పించారు. జాతర మొదలు కాకముందే నెలన్నర రోజులుగా ప్రతి రోజు భక్తులు తరలివస్తున్నారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**30 వేలకు పైగా సిబ్బంది సేవలు..** సమ్మక్క సారలమ్మ మహాజాతర మొదలవుతుండటంతో భారీ ఏర్పాట్లను చేశారు. ఇప్పటికే 30 వేలకు పైగా సిబ్బందిని జాతర కోసం మోహరించారు. ఆర్టీసీ కూడా బస్సులను మేడారానికి పెంచింది. వరంగల్ నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సు సర్వీసులను కొనసాగిస్తున్నారు. వరంగల్ నుంచి మేడారం వరకు ప్రధాన రహదారిపై వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు దృష్టిసారించారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలను చేపడుతున్నారు. వాహనాల ద్వారా భక్తులు మేడారం చేరుకునే విధంగా ఏర్పాట్లను చేశారు.

**మేడారంలో ఏఐ టెక్నాలజీ..** మేడారం జాతర సందర్భంగా అధునాతన ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. జాతరలో సీసీ కెమెరాలను వినియోగించడంతో పాటు డ్రోన్ కెమెరాలను వాడుతున్నారు. కమాండ్ కంట్రోల్ ద్వారా మానిటరింగ్ చేయడంతో పాటు భారీగా రద్దీ ఉన్నచోట పరిశీలించి చర్యలు చేపడుతున్నారు.

జాతరలో మొదటి సారి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు వృద్ధులు, పిల్లలు తప్పి పోకుండా ఉండేందుకు జియోట్యాగింగ్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. వేలాది వాహనాలు తరలి రానుండటంతో అన్ని రకాల ఏర్పాట్లను చేస్తున్నారు.

**జాతర పరిసరాలు వెలిసిన గుడారాలు..** మేడారంలో జాతర మొదలు కాకముందే వేలాది గుడారాలు వెలిశాయి. జాతర పరిసరాల్లో అన్నింటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గద్దెల వద్ద నుంచి జంపన్న వాగు వరకు చుట్టుపక్కల ఐదారు కిలోమీటరు మేర దుకాణాలు, గుడారాలు వెలిసాయి. భక్తుల తాకిడిని బట్టి ధరలు పెంచి అమ్మకాలు చేస్తున్నారు. తాగునీటి నుంచి ఆహార పదార్థాల వరకు భారీ రేట్లకు అమ్మకాలు చేస్తున్నారు. టెంటు, గుడారాల్లో కూడా భారీగా వసూలు చేస్తున్నారు. జాతరలో మద్యం అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. జాతర సందర్భంగా 22 మద్యం దుకాణాలకు తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. ఈ దుకాణాల్లో భారీగా ధరలు పెంచి అమ్మకాలు చేస్తున్నారు. బీర్లు, క్వాటర్ మద్యం పై రూ.50 నుంచి రూ.100 వరకు ధరలు పెంచి అమ్ముతున్నారు. జాతర పై దృష్టి పెట్టిన అధికారులు ధరల నియంత్రణ పై దృష్టి సారించకపోవడంతో భారీగా భక్తులకు నష్టం వాటిల్లుతుంది. జాతరలో ఎలాంటి ఇబ్బందులు భక్తులకు ఏర్పడకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రి సీతక్క తెలిపారు.

మొదటి సారిగా గద్దెల వద్ద శాశ్వత నిర్మాణాలు చేపట్టామని, ప్రభుత్వం జాతరకు రూ.251 కోట్లను వెచ్చించదని మంత్రి తెలిపారు.




## మేడారం జాతర.. శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

హైదరాబాద్: మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ త్యాగానికి, ధిక్కారానికి ఆదివాసీ దేవతలు సమ్మక్క సారలమ్మలు ప్రతీకలని కేసీఆర్ అన్నారు. కొంగు బంగారమై, కోరిన కోరికలు తీర్చే తమ ఇలవేల్పులకు మొక్కులు తీర్చుకునేందుకు కోట్లాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం జాతర కుంభమేళాను తలపిస్తూ ఆధ్యాత్మిక కేంద్రమై కొనసాగుతుందన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాజాల సబ్బండ కులాల సంస్కృతి సాంప్రదాయాలకు పదేళ్ల బీఆర్ఎస్ పాలన పెద్దపీట వేసిందని పేర్కొన్నారు.

# ఎన్నికల సంఘం బిగ్ షాక్.. పార్టీలకు నో టైమ్..




హైదరాబాద్, జనవరి 27: రాష్ట్రంలో మరో ఎన్నికల సంగ్రామానికి రంగం సిద్ధమైంది. ఇటీవలే పంచాయతీ ఎన్నికలు ముగియగా.. ఆ హడావుడి తగ్గక ముందే మరో ఎన్నికలకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ సిద్ధమైంది. తాజాగా మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్?ను ఈసీ రిలీజ్ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. అయితే, తాజా నోటిఫికేషన్?తో ఈసీ అన్ని పార్టీలకు బిగ్ షాకిచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే.. అభ్యర్థులను ఖరారు చేసేందుకు కనీస సమయం కూడా ఇవ్వలేదు ఈసీ. రేపటి నుంచే(జనవరి 28వ తేదీ) నామినేషన్ల ప్రకియ ప్రారంభం అవుతుండటం.. కేవలం 3 రోజులు అంటే జనవరి 30 వరకు మాత్రమే నామినేషన్లకు అవకాశం కల్పించడంతో ఆయా పార్టీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఈసీ ఇచ్చిన మూడు రోజుల వ్యవధిలోనే అభ్యర్థులను ఖరారు చేసుకోవడం, వారికి బీఫాం ఇవ్వడం చేయాలంటే ఆయా పార్టీలకు పెద్ద టెన్షన్?తో కూడిన పనే అని చెప్పాలి. పైగా ప్రచారం చేసే సమయం కూడా పెద్దగా లేదు. ఫిబ్రవరి 11వ తేదీనే రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. దీంతో ప్రచారానికి కూడా ఎక్కువ సమయం లేకుండా పోయింది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 2,996 వార్డులకు ఎన్నికలు జరుగనుండగా.. ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు, ప్రధాన పార్టీల నుంచి టికెట్ పొందేందుకు ఎంతోమంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరగనున్నాయని సమాచారం బయటకు వచ్చినప్పటి నుంచే ఆశావహులు తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తూ వచ్చారు. గ్రౌండ్ లెవల్లో పనులు చేసుకుంటూనే.. పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైపోయారు. అయితే, ఆశావహులు ఎంతమంది ఉన్నప్పటికీ.. పార్టీల తరఫున టికెట్ మాత్రం కొందరికే వచ్చే అవకాశం ఉంటుంది. ఇందుకోసం అభ్యర్థుల బలాబలాలను పరిశీలించి.. ఎవరైతే గెలవగలరో వారికి మాత్రమే టికెట్ కేటాయిస్తారు. ఈ తతంగం అంతా చేయాలంటే ఖచ్చితంగా టైమ్ పడుతుంది. కానీ, ఈసీ మాత్రం రాజకీయ పార్టీలకు అంత టైమ్ ఇవ్వలేదు. కేవలం మూడు రోజులు మాత్రమే నామినేషన్లకు అవకాశం ఇవ్వడంతో.. ఆయా పార్టీల్లో, ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది.



# బడ్జెట్-2026లో ఏఐకి పెద్ద పీట?

## ప్రజల జీవితాల్లోకి కృత్రిమ మేధస్సు!

అమరావతి : కేంద్ర బడ్జెట్‌కు ఇంకా కొన్ని రోజులే మిగిలి ఉండటంతో, బడ్జెట్-2026పై విధాన నిర్ణేతలు పెద్ద స్థాయిలో దృష్టి సారిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌ను ప్రజలకు మరింత ఉపయోగకరంగా, అలాగే భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రూపొందించాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధస్సు ప్రభుత్వ ఆర్థిక, సామాజిక ఆలోచనల్లో ఒక ప్రధాన స్తంభంగా మారుతున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఏఐకి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారని వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ూ×ని ఉద్యోగాలను తీసేసే సాంకేతికతగా కాకుండా, పనితీరును పెంచే సాధనంగా, ప్రజల రోజువారీ జీవితాలను మెరుగుపరచే ఒక శక్తివంతమైన సాధనంగా చూపించాలన్నది ప్రభుత్వ దృష్టిగా తెలుస్తోంది. అన్ని రంగాల్లో ఉత్పాదకత పెరగాలనే లక్ష్యంతో ఏఐను వినియోగించాలనే ఆలోచన బడ్జెట్‌లో ప్రతిబింబించే అవకాశం ఉంది. పర్సనల్ ఫైనాన్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, మ్యూచువల్ ఫండ్స్ లేదా మనీ సేవింగ్ టిప్స్ గురించి ప్రశ్నలు, సందేహాలు ఉన్నాయా? మీ ప్రశ్నను ఇక్కడ సబ్మిట్ చేయండి. ఫైనాన్స్ ఎక్స్?పర్ట్స్ నుండి సమాధానాలు పొందొచ్చు. ఎంపిక చేసిన ప్రశ్నలకు సమాధానాలను మా వెబ్‌సైట్‌లో ఆర్టికల్స్ రూపంలో మరుసటి రోజు చూడొచ్చు. ఈసారి బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణ రంగంపై ఏఐ ఆధారిత విధానాలు కీలకంగా ఉండవచ్చని సమాచారం. ముఖ్యంగా వ్యాధులను తొలిదశలోనే గుర్తించేందుకు సహాయపడే ఏఐ ఆధారిత నిర్ధారణ పరికరాలకు ప్రభుత్వం మద్దతు ఇవ్వవచ్చని వర్గాలు చెబుతున్నాయి. ఎక్స్‌రేలు, స్కాన్లు, ఇతర వైద్య చిత్రాలను విశ్లేషించడంలో యంత్ర అభ్యాస (మిషన్ లెర్నింగ్) సాంకేతికతను ఉపయోగించడం ద్వారా త్వరగా, తక్కువ ఖర్చుతో సరైన నిర్ధారణ సాధ్యమవుతుంది. ఇది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, వైద్య సదుపాయాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రోగులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని భావిస్తున్నారు. వ్యవసాయం కూడా ఏఐ విధానాల్లో ముఖ్యమైన స్థానం పొందే రంగంగా కనిపిస్తోంది. రైతులకు విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ వంటి అంశాల్లో మార్గనిర్దేశం చేసే ఏఐ ఆధారిత వ్యవసాయ సలహా వేదికలను బడ్జెట్‌లో ప్రస్తావించే అవకాశం ఉంది. అలాగే పంట దిగుబడిని ముందుగానే అంచనా వేసే మోడళ్ల ద్వారా రైతులు సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీని వల్ల ప్రభుత్వానికి కూడా ఆహార సరఫరా, ధరల నియంత్రణ, ద్రవ్యోల్బణ నిర్వహణ మరింత సమర్థంగా చేయడానికి అవకాశం కలుగుతుంది. డేటా మరియు ఏఐ ఆధారంగా వ్యవసాయాన్ని ఆధునీకరించడం ద్వారా రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రోజువారీ జీవితానికి దగ్గరగా, ఏఐను "ప్రజలకు అనుకూలమైన టెక్నాలజీ"గా అభివృద్ధి చేయాలన్న ఆలోచన కూడా బడ్జెట్‌లో ప్రతిఫలించవచ్చని సమాచారం. చాట్‌బాట్‌లు లేదా చాట్ ఆధారిత ఏఐ యాప్‌ల ద్వారా ప్రభుత్వ పథకాలు, పన్నులు, ఆర్థిక లెక్కలు వంటి క్లిష్టమైన సమాచారాన్ని సాధారణ పౌరులు సులభంగా అర్థం చేసుకునేలా చేయాలన్నది లక్ష్యం. ఈ విధంగా ఏఐ పెద్ద కంపెనీలకే పరిమితం కాకుండా, సామాన్య ప్రజలకు ఉపయోగపడే సాధనంగా మారనుంది. టెలికాం మరియు కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలలో కూడా ఏఐ పాత్రను బడ్జెట్‌లో ప్రస్తావించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా 5+ సేవలు విస్తరిస్తున్న నేపథ్యంలో, భారీగా ఉత్పత్తి అయ్యే డేటాను సమర్థంగా నిర్వహించడానికి ఏఐ వ్యవస్థలు కీలకంగా మారుతున్నాయి. నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను నియంత్రించడం, సేవా నాణ్యతను మెరుగుపరచడం, అంతరాయాలను తగ్గించడం వంటి అంశాల్లో ఏఐ ఉపయోగపడుతుంది. అలాగే విద్యుత్ రంగంలో కూడా డిమాండ్ అంచనా, గ్రిడ్ నిర్వహణ, విద్యుత్ వృథా తగ్గింపులో ఏఐ ఆధారిత పరిష్కారాలు కీలకంగా మారవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, సెమీకండక్టర్లకు డిమాండ్ కూడా గణనీయంగా పెరిగింది. ఈ అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, భారత్‌లో స్వదేశీ సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు బడ్జెట్‌లో మరింత మద్దతు లభించే అవకాశం ఉంది. సెమీకండక్టర్ తయారీ, అనుబంధ సేవలకు అధిక కేటాయింపులు చేసి, భారత్‌ను మధ్యకాలంలో ఈ రంగంలో కీలక ఆటగాడిగా నిలబెట్టాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం బడ్జెట్ ద్వారా బలపరచవచ్చని వర్గాలు చెబుతున్నాయి. ఈ టెక్నాలజీ ఆధారిత దృక్పథంతో పాటు, సామాన్య ప్రజలకు నేరుగా ఉపశమనం ఇచ్చే పన్ను ప్రతిపాదనలు కూడా చర్చలో ఉన్నాయి. కొత్త పన్ను విధానంలో గృహ రుణాలపై వడ్డీకి గరిష్టంగా రూ.2 లక్షల వరకు మినహాయింపును చేర్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇది పాత పన్ను విధానంలో మాత్రమే లభిస్తోంది. అలాగే వైద్య బీమా ప్రీమియంలపై రూ.50,000 వరకు మినహాయింపు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో ఇది మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఉపశమనంగా మారవచ్చు. అదే సమయంలో, ప్రపంచ వాణిజ్యంలో ఉన్న అస్థిరతను దృష్టిలో ఉంచుకుని, కొన్ని ఎంపిక చేసిన వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించే అవకాశం కూడా ఉందని వర్గాలు సూచిస్తున్నాయి. దీని వల్ల దేశీయ పరిశ్రమలకు ముడిసరుకు ఖర్చులు తగ్గుతాయి. అలాగే దిగుమతి ద్వారా వచ్చే ద్రవ్యోల్బణ ప్రభావం తగ్గి, వినియోగదారులపై ధరల భారం కొంతమేర తగ్గే అవకాశం ఉంటుంది. బడ్జెట్-2026 టెక్నాలజీ, ఏఐ, ప్రజల సంక్షేమం మరియు ఆర్థిక స్థిరత్వం మధ్య సమతుల్యత సాధించే ప్రయత్నంగా ఉండవచ్చని అంచనా వేయబడుతోంది. ప్రజలకు ఉపయోగపడే విధానాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకున్న పెట్టుబడులతో ఈ బడ్జెట్ దేశ ఆర్థిక దిశను కొత్త మార్గంలో నడిపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సంపాదకీయం

## ఐక్య రాజ్య సమితి సెటప్ మార్చాల్సిందే... భారత్ కి చోటు దక్కాల్సిందే!

ఈ రోజున ప్రపంచం పూర్తిగా అస్థిరతతో ఉంది. ఒక విధంగా చెప్పాలీ అంటే గందరగోళంలో ఉంది. యుద్ధాలు ఒక వైపు సాగుతున్నాయి. మరో వైపు చూస్తే బలవంతుడిదే నీతి అన్న విధానం కొనసాగుతోంది. ఫలితంగా ప్రపంచంలో అశాంతి పెరుగుతోంది. ఎపుడు ఎక్కడ ఏమి జరుగుతుందో అన్నది తెలియడం లేదు, అభద్రతా భావంతో అంతా కొట్టుమిట్టాడుతోంది. ఈ నేపథ్యంలో ఐక్య రాజ్య సమితిని భద్రతా మండలిని మార్చాలని పూర్తి స్వరూప స్వభావాలను కూడా మార్చాలని డిమాండ్ పెద్ద ఎత్తున పెరుతోంది.

**భారత్ కోరింది ఇదే :** ఐక్య రాజ్య సమితి 1945లో ఏర్పాటు అయింది. మరి ఆనాటికి ఈనాటికీ పోలిస్తే చాలా మార్పులు వచ్చాయి. ఈ రోజున ప్రపంచం వేరుగా ఉంది. ఇంకా పాత నియమాలను పెట్టుకుని నడుపుదామని అనుకుంటే కుదిరే అవకాశాలు లేవు, దానికి ఉదాహరణగా ప్రపంచంలో అనేక యుద్ధాలే ఉన్నాయని అంటున్నారు. దాంతో ఐక్య రాజ్య సమితిని భద్రతా మండలిని సమూలంగా మార్చాలని డిమాండ్ అయితే వస్తోంది. ఇదే రూపంలో కొనసాగించాలని చూస్తే మాత్రం ఇంకా ప్రపంచంలో అశాంతి ఎక్కువ అవుతుందని అలగే యుద్ధాలు సమస్యలు కూడా ఎక్కువ అవుతాయని భారత్ ఇటీవల జరిగిన ఐక్యరాజ్య సమితిలో హెచ్చరించింది. ఐక్య రాజ్య సమితిలో భారత్ రాయబారిగా ఉన్న పి హరీష్ మాట్లాడుతూ భద్రతా మండలిలో మార్పులు చేయాల్సిందే అని స్పష్టం చేశారు.

**జీ4 డిమాండ్ ఇదే :** ఇక కేవలం భారత్ మాత్రమే కాదు జీ4 దేశాల డిమాండ్ ఇలాగే ఉంది. భారత్ బ్రెజిల్, జర్మనీ, జపాన్ ఇలా ఉన్న ఈ నాలుగు దేశాలను జీ4 గా పిలుస్తారు. ఈ దేశాలు అన్నీ ఒక్కటే కోరుతున్నాయి. ఐక్య రాజ్య సమితి నిబంధలను మార్చాలని కోరాయి. అలాగే ప్రస్తుతం ఉన్న భద్రతా మండలిలో సభ్య దేశాల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశాయి. ప్రస్తుతం పదిహేను సభ్య దేశాలు ఉన్నాయి. అందులో అయిదు మాత్రమే శాశ్వత సభ్య దేశాలు. అయితే ఈ సభ్య దేశాలను పాతిక దాకా పెంచాలని జీ4 దేశాలు కోరుతున్నాయి. అంతే కాదు శాశ్వత సభ్య దేశాల సంఖ్యను అయిదు నుంచి మరో ఆరు అదనంగా కలిపి 11 దాకా చేయాలని కోరుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచం పరిస్థితులు మారాయని అందువల్ల దానికి తగినట్లుగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా వంటి దేశాలను కూడా తగిన ప్రాతినిధ్యం ఉండాలని జీ4 దేశాలు కోరాయి.

**కళ్ళెదుట యుద్ధాలు :** ఈ రోజున చూస్తే ఉక్రెయిన్ రష్యాల మధ్య యుద్ధం దాదాపుగా అయిదేళ్ళుగా సాగుతోంది. అలాగే గాజా వంటి చోట్ల యుద్ధాలు అలాగే కొనసాగుతున్నాయి, ఈ సమస్యలను పరిష్కరించడంతో ప్రస్తుతం ఐక్య రాజ్యసమితి చేస్తున్న ప్రయత్నాలు సరిపోవడం లేదని అంటున్నారు. సాధరణ ప్రజలు అంతా ఈ యుద్ధాల వల్ల ఎంతో ఇబ్బంది పడుతున్నారు. అంతే కాదు పేద దేశాలు ధనిక దేశాల మధ్య అంతరం పెరుగుతోంది, చిన్న దేశాలకు భద్రత ఉండడం లేదు, ఇవన్నీ ఐక్య రాజ్యసమితి భద్రతా మండలి పరిశీలించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

# విద్యాభివృద్ధికి కార్పొరేట్ సంస్థల సహకారం ప్రశంసనీయం : డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్







శామీర్ పేట, జనవరి 27( గరుడ వార్త) : విద్యాభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సహకారం అందించడం ప్రశంసనీయమని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. జిహెచ్ఎంసి శామీర్ పేట వార్డ్ పరిధిలోని దేవరయాంజాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రాజబొల్లారం మోనార్క్ ఎర్గో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు 60 టేబుల్స్?ను విద్యార్థులకు మంగళవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా రాజబొల్లారం మోనార్క్ ఎర్గో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 60 టేబుల్స్?ను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులకు సరిపడా టేబుల్స్ లేవని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్, దాతల సహకారంతో టేబుల్స్ ఏర్పాటు చేయాలని జిల్లా ఆర్టీఏ సభ్యుడు భిమిడి జైపాల్ రెడ్డిని ఆదేశించారు.

దీంతో జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి నాగిరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతో రాజబొల్లారం మోనార్క్ ఎర్గో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత కోటేశ్ జగనాథం తో మాట్లాడి, పాఠశాలకు అవసరమైన 60 టేబుల్స్?ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్ హాజరయ్యారు. రాజబొల్లారం మోనార్క్ ఎర్గో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత కోటేశ్ జగనాథంతో పాటు పలువురు నాయకులతో కలిసి విద్యార్థులకు టేబుల్స్?ను అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో విద్యా నాణ్యత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. సంస్థ అధినేత కోటేశ్ జగనాథం మాట్లాడుతూ విద్యే సమాజాభివృద్ధికి పునాదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగమని, భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, నాయకులు రాజబొల్లారం మోనార్క్ ఎర్గో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత కోటేశ్ జగనాథంని శాలువతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్ కట్ట మీనా కుమారి, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్, దర్మకర్తలు, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు, మాజీ వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు పొందకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదు : శామీర్ పేట సీఐ శ్రీనాథ్




శామీర్ పేట, జనవరి 27 ( ప్రజా మలుపు) : మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసినందున అనుమతులు పొందకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ సూచించారు. మంగళవారం ఎన్నికల కమిషనర్ మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసినందున పలు ఆంక్షలు అమల్లో ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పోలీసుల ముందస్తు అనుమతి, సమాచారం లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు, గుంపులుగా ఉండడం వంటి కార్యక్రమాలు నిర్వహించరాదని చెప్పారు. అనుమతి లేకుండా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారికి చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అలాగే ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లు గమనించినట్లయితే, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు పోలీసు శాఖకు ప్రజల సహకారం అందించాలన్నారు. శామీర్?పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

**నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు....**

మల్కాజ్ గిరి కమిషనర్ ఆదేశాల మేరకు నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మూడు చింతలపల్లి లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం పరిసరాల్లో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులుగా చేరకూడదని, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు, ప్రతిపాదకులు, ప్రజలు పలు సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నామినేషన్ కేంద్రానికి అభ్యర్థితో పాటు ఒకరు, ఇద్దరు ప్రతిపాదకులు ( ప్రపోజల్స్ )ను అనుమతించబడతారని తెలిపారు. నామినేషన్ కేంద్రంలో శాంతిభద్రతలు పాటించాలని, నినాదాలు చేయడం, ప్రచారం నిర్వహించడం నిషేధమని చెప్పారు. అభ్యర్థి గుర్తింపునకు ఆధార్ కార్డు, ఓటర్ ఐడి వంటి చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. నామినేషన్ కేంద్రం వెలుపల ఎన్నికల ప్రచారం పూర్తిగా నిషేధించబడినదని, నామినేషన్ కేంద్రం పరిసరాల్లో నినాదాలు, లౌడ్ స్పీకర్లు, బ్యాండ్లు వాడకూడదని తెలిపారు. అభ్యర్థితో పాటు పరిమిత సంఖ్యలోనే అనుచరులు రావాలని, నామినేషన్ కేంద్రం బయట బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేయరాదన్నారు. ట్రాఫిక్?కు అంతరాయం కలగకుండా వాహనాలను కేంద్రానికి దూరంగా పార్క్ చేయాలని తెలిపారు. గుంపులుగా చేరడం, గందరగోళం సృష్టించడం నిషేధించబడినదని చెప్పారు. ఎన్నికల అధికారులు, పోలీసు అధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, నామినేషన్ కేంద్రం పరిసరాల్లో మద్యం సేవించడం, మద్యం పంపిణీ చేయడం నిషేధమన్నారు. ఇతర అభ్యర్థులను బెదిరించడం, అడ్డుకోవడం వంటి అనైతిక చర్యలకు పాల్పడరాదని, ఎన్నికల కోడ్ ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించరాదని చెప్పారు. శాంతియుతంగా, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మెప్మా మహిళా సంఘాల సభ్యులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించిన పోలీసులు....




శామీర్ పేట, జనవరి 27 ( గరుడ వార్త) : ట్రాఫిక్ నియమ, నిబంధనలపై మెప్మా మహిళా సంఘాల సభ్యులకు పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం జిహెచ్ఎంసి శామీర్ పేట వార్డు పరిధిలోని ఉప్పర్ పల్లిలో మెప్మా మహిళా సంఘాల సభ్యులకు బేగంపేట ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు పర్యవేక్షణలో, అల్వాల్ ట్రాఫిక్ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెప్మా మహిళా సంఘాల సభ్యులు తమ కుటుంబ సభ్యులకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేయాలని తెలిపారు. వాహనాలను అధిక వేగంగా నడపరాదని, కార్లు నడిపే వారు సీట్?బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చెప్పాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడప రాదని మీ మీ కుటుంబ సభ్యులకు కచ్చితంగా తెలియజేయాలని అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితంగా వాహనాలు నడిపే విధంగా తమ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నవీన్ రెడ్డి, ఎస్ఐ కృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, జనవరి 27 (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద దర్గాటోలిచౌకి చెందిన కీ. శే కాసుల పెంటయ్య గౌడ్





జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. అలాగే శామీర్ పేట కు చెందిన కీ. శే బత్తిని ఈశ్వర్ గౌడ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, అలాగే లక్కోజు దుర్గాషణ- పద్మావతి దంపతులు అన్నదానా నికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# వసతి.. వణుకు!

గద్వాల : ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులు చలికి వణికిపోతున్నారు. గదులకు కిటికీలు, తలుపులు సరిగా లేకపోవడం, వేడి నీటి వసతిలేక ఉదయాన్నే చన్నీటి స్నానం చేయాల్సి రావడంతో నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లో సగానికిపైగా కిటికీలకు రెక్కలు విరిగిపోయాయి. దీంతో చలి నుంచి రక్షణ పొందేందుకు విద్యార్థులు టవల్స్, దుప్పట్లను అడ్డంగా కిటికీలకు అడ్డంగా పెట్టుకుంటున్నారు. దోమల బెడద తీవ్రంగా ఉంది. ఏళ్ళుగా సమస్య ఉన్నా సంక్షేమశాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. జిల్లాలో ఒక్కోసారి 12 నుంచి 15 డిగ్రీల ఉష్ో?గ్రత నమోదవుతోంది. ఇంత ఎముకల కొరికే చలిలోనే వసతిగృహ విద్యార్థులు చన్నీటి స్నానాలు చేయాల్సిన దౌర్భాగ్యం ఉంది. దీంతో పలువురు విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. వేడి నీటి వసతి కల్పించాలని మొరపెట్టుకున్నా సంబంధిత అధికారుల నుంచి పట్టింపు కరవైంది. ప్రతిపాదనలు పంపించాం.. వసతిగృహాల్లో కిటికీలు, తలుపుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా వేడి నీటి వసతి లేదని ప్రభుత్వం నిర?యం తీసుకోవాల్సి ఉందని సంక్షేమశాఖ జిల్లా అధికారులు అక్బర్ (బీసీ), నుషిత (ఎస్సీ) తెలిపారు. గద్వాల పట్టణంలో చింతలపేటలోని ఎస్సీ, బీసీ, ఆనందనిలయం వసతిగృహాల్లో కలిపి సుమారు 645 మంది విద్యార్థులున్నారు. వేడి నీటి వసతి లేకపోవడంతో ప్రతి రోజూ విద్యార్థులు చలిలో ఇలా చన్నీటి స్నానమే చేయాల్సి వస్తోంది. గద్వాల పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహంలో కిటికిలు, తలుపులు విరిగిపోయాయి. దీంతో కిటికీలకు దుప్పట్లు, టవల్స్ ఇదిగో ఇలా అడ్డం పెట్టుకుని చలి నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నారు.

# కల్తీ.. కల్తీ.. తనిఖీ పల్టీ!

గద్వాల, కృష్ణవేణి చౌక్, న్యూస్‌టుడే: జోగులాంబ జిల్లాలో ఫలహార శాలలు, ప్రధాన రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మాంసాహార దుకాణాలను, ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు ప్రతి నెలా విధిగా తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఏదైనా ఘటనలు జరిగిన సమయంలో మాత్రమే హడావిడి చేసి, తర్వాత పట్టించుకోకపోవటంతో ప్రజల ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ముఖ్యంగా ప్రధాన హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వినియోగించే నూనెల్లో ఎక్కువగా కల్తీవి వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దానికి తోడు హోటళ్లు రెస్టారెంట్లలో వంట గదుల్లో పూర్తి స్థాయిలో పరిశుభ్రత లేకపోవటంపై పరిశీలించే వారు కరవైన పరిస్థితి ఉందని ప్రజలంటున్నారు. మరి ముఖ్యంగా కూరగాయాల విషయంలో కూడా తక్కువ గ్రేడ్‌వి కొనుగోలు చేసి వినియోగిస్తున్నారనే ఆరోపణ ఉంది. వీటిన్నింటిపై తనిఖీలు లేకపోవటంతో గత మూడు రోజుల కిందట సాక్షాత్తు జిల్లా పాలనాధికారి ఆహార కల్తీనిరోధక శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికైనా అధికారుల్లో కదలిక వస్తుందేమో చూడాలి. జిల్లాలో 2,600 పైగా హోటళ్లు రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మాంసాహార, బేకరీలు, మిఠాయి దుకాణాలున్నాయి. నిర్వాహకులు ఆహార కల్తీ నిరోధక శాఖ నుంచి తప్పక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని అనుమతి తీసుకున్న వారి సంఖ్య తక్కువగా ఉంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న వారు అసలు తీసుకోవటం లేదన్న మాట తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసుకున్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్, మాంసాహార దుకాణాలు ఇతర ఫలహార శాలలు నమోదు చేసుకోనివి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలి కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. అలాగే ప్రతి నెలా 25 హోటళ్లు, ప్రభుత్వ వసతి గృహాల్లో ఆహార నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపి నివేదికలు సమర్పించాలని జిల్లా పాలనాధికారి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది.

# నో హెల్మెట్.. నో పెట్రోల్

వేములవాడ : అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు 2025 నవంబర్లో ద్విచక్ర వాహనంపై వెళ్తూ అగ్రహారం శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొని మృతి చెందారు. శిరస్త్రాణం (హెల్మెట్) ధరించి ఉంటే గాయాలతో బయటపడేవారని స్థానికులు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా బస్వాపూర్కు చెందిన శేఖర్ 2025 జూన్లో ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ అగ్రహారం ఆలయ సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న గూడ్స్ ఆటోని ఢీకొన్నాడు. శిరస్త్రాణం లేకపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారిలో ఎక్కువ మంది ద్విచక్రవాహన దారులే ఉంటున్నారు. వీరిలో చాలామంది శిరస్త్రాణం ధరించకపోవడంతోనే మృతిచెందుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

**విస్తృత అవగాహన**

జిల్లాలో పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు నిత్యం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. శిరస్త్రాణం లేకపోతే జరిమానాలు విధించడంతోపాటు అవగాహన కల్పిస్తున్నారు. వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనం నడిపేవారిని ఆటోమేటిక్ చలాన్ కెమెరాల ద్వారా గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. అయినప్పటికీ కొందరు వాహనదారుల్లో మార్పు రావడం లేదు. దీంతో




ప్రభుత్వం హెల్మెట్ ధరించాలనే నిబంధనను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే పెట్రోల్ బంకుల్లో 'నో హెల్మెట్.. నో పెట్రోల్' నిబంధనను కఠినంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితె ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు జాతీయ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ 'నో హెల్మెట్.. నో పెట్రోల్ అమలు చేస్తామని చెబుతున్నారు. పెట్రోల్ బంకుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి శిరస్త్రాణంతోనే డ్రైవింగ్ చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు పోలీసు శాఖ, రవాణాశాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

**నిబంధనలు పాటించాలి**

ప్రమాద సమయంలో ద్విచక్ర వాహన దారుడి తలకు హెల్మెట్ ఉంటే గాయాలతో భయటపడొచ్చు. ముందుగా పోలీసులే హెల్మెట్ ధరిస్తూ వాహనాలు నడిపేలా చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీల సమయంలో జరిమానాలు విధించడంతో పాటు హెల్మెట్, వాహన పత్రాలు కలిగి ఉండాలని కౌన్సెలింగ్ ఇస్తున్నాం. 'నో హెల్మెట్.. నో పెట్రోల్'పై జిల్లా అంతటా అవగాహన కల్పిస్తున్నాం. హెల్మెట్ ధరించడం బాధ్యతగా భావించి ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. – మహేష్ బి.గితె, ఎస్పీ

# ఊటలే.. ఊడలు..!

కొత్తగూడెం: ప్రకృతి ప్రసాదించిన వరాల్లో సహజ నీటి ఊటలు ఒకటి. మోటార్లు, పంపుల అవసరం లేకుండా భూమి పొరల నుంచి స్వచ్ఛమైన నీరు పైకి ఉబికి వస్తుంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు, అడవుల్లో ఈ ఊటలే జీవకోటికి ప్రధాన ఆధారాలు. ఈనేపథ్యంలో దేశ వ్యాప్తంగా నీటి ఊటలను కాపాడుకోవటానికి కేంద్రం నడుంబిగించింది. ఇటీవల ప్రారంభమైన చిన్ననీటి వనరుల గణనలో భాగంగా తొలిసారి వీటిపై జలశక్తి మంత్రిత్వశాఖ ప్రత్యేక సర్వే నిర్వహిస్తోంది.

**ఉభయ జిల్లాల్లో..** భద్రాద్రి జిల్లాలో 15–18, ఖమ్మం జిల్లాలో 2–4 సహజ ఊటలు ఉంటాయని భూగర్భ జలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు లక్ష్మీదేవిపల్లి, మణుగూరు, చర్ల, అశ్వాపురం మండలాలతో పాటు సత్తుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో సర్వేచేసి 13 ఊటలను గుర్తించారు. అందులో భద్రాద్రి జిల్లాలో 12, ఖమ్మం జిల్లాలో కేవలం ఒక ఊట ఉన్నట్లు తేల్చారు. లక్ష్మీదేవిపల్లి మండలం చంద్రునాయక్తాండలో ఓ రైతు.. సహజ ఊట సహాయంతో వ్యవసాయం చేస్తున్నట్లు అధికారులు గుర్తించటం విశేషం. అనేకచోట్ల గిరిజనులకు ఇవి తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్నాయని చెబుతున్నారు.

**కలిగే ప్రయోజనాలు..**

సహజసిద్ధంగా వచ్చే ఈ నీటిలో ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉంటాయి. పంపులు, విద్యుత్తు అవసరం లేకుండానే వాలును బట్టి పొలాలకు నీటిని మళ్లించవచ్చు.అడవుల్లోని వన్యప్రాణులకు ఎండాకాలంలో ఇవే



దాహార్తిని తీరుస్తాయి. ఖమ్మం, భద్రాద్రి వంటి జిల్లాల్లోని గిరిజన గ్రామాలు తాగు, సాగునీటి అవసరాల కోసం ఊటలపైనే ఆధారపడు తున్నాయి. పశువుల కాపరులు, చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారుతున్నాయి.

సర్వే చేపట్టడానికి ప్రధాన కారణాలు...విపరీతమైన బోరుబావుల తవ్వకం వల్ల భూగర్భ జలమట్టం పడిపోతోంది. సహజ ఊటలను రక్షించుకుంటేనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు దేశంలో ఎన్ని ఊటలున్నాయి? ఎక్కడున్నాయి? వాటి ప్రవాహ సామర్థ్యం ఎంత? అనే విషయాలపై స్పష్టమైన గణాంకాలు లేకపోవటంతో సర్వే నిర్వహిస్తోంది.

భవిష్యత్తు ప్రణాళిక ఏంటి..?సర్వే అనంతరం ప్రతి ఊటకు ఒక ప్రత్యేక నంబర్ కేటాయించి జియో ట్యాగింగ్ చేస్తారు.

ఎండిపోతున్న ఊటల వద్ద చెక్డ్యామ్లు నిర్మించటం, అడవులను పెంచటం ద్వారా నీటి ప్రవాహం పెరిగేలా చూస్తారు. వీటి పరిరక్షణ బాధ్యతలను స్థానిక గ్రామ పంచాయతీలకు అప్పగిస్తారు.

ఊటల నుంచి వచ్చే నీటిని తాగునీటి పథకాలకు అనుసంధానిస్తారు.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఇప్పటివరకు 13 ఊటలను గుర్తించాం. మరో ఏడు ఊటల వరకు వెలుగుచూడవచ్చు. ఈనెలాఖరు వరకు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

రమేష్, భూగర్భజలశాఖ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# నిర్లక్ష్యం.. నిప్పు.. పరిశ్రమకు ముప్పు



హైదరాబాద్: వేసవి కాలం.. శీతకాలం తేడా లేకుండా పరిశ్రమల్లో సంభవిస్తున్న ప్రమాదాలను నియంత్రించేందుకు గ్రేటర్ పరిధిలోని పరిశ్రమల పర్యవేక్షణ అధికారులు ప్రామాణిక కార్యాచరణ పాటించాలంటూ మార్గదర్శకాలు జారీ చేశారు. నిర్లక్ష్యం... నిప్పు ప్రధాన కారణాలుగా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని విశ్లేషించారు. పరిశ్రమల జనరల్ మేనేజర్లు, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కార్మికశాఖ అధికారులు కొత్త విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

**పనిముట్ల నిర్వహణ..** ప్రామాణిక కార్యాచరణ విధానం అమలులో ప్రధానంగా యంత్రాలు...పనిముట్ల నిర్వహణపై పరిశ్రమల్లోని అధికారులు, కార్మికులు అప్రమత్తంగా ఉండాలంటూ పరిశ్రమల పర్యవేక్షణ అధికారులు సూచించారు. యంత్రాల్లో చిన్న బోల్టు, బేరింగ్ అరిగిపోయినా వెంటనే మార్చాలని వారికి తెలిపారు. పాశమైలారం సిగాచీ రసాయన పరిశ్రమలో గతేడాది జూన్లో డయ్యర్ పేలి 46మంది మృతిచెందిన నేపథ్యంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతపై అనుక్షణం నిఘా ఉంచాలని పేర్కొన్నారు. రియాక్టర్లు, సిలిండర్లు, యంత్రాల పనితీరును పర్యవేక్షించేందుకు కృత్రిమమేధ పరికరాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించాలంటూ పేర్కొన్నారు.

**యంత్రాలు... కార్మికుల పనితీరుపై నివేదికలు**

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలున్న అంశాలను అక్కడున్న ఉద్యోగులు, కార్మికులతో పాటు ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు కచ్చితంగా చూసుకోవాలన్నారు. ఇందులో భాగంగా యంత్రాలు, కార్మికుల పనితీరుపై రెండు వారాలకోసారి నివేదికలను రూపొందించాలని పరిశ్రమలకు ఆదేశాలు జారీచేశారు. ఏప్రిల్ తొలివారం నుంచి పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలన్నీ ఆయా పరిశ్రమల వెబ్సైట్లలో ఉంచాలని, ప్రభుత్వ అధికారులకు ఆన్లైన్ ద్వారా సమాచారం పంపించే విధంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పరిశ్రమల్లో సీసీ కెమెరాలుండాలని వాటిని అదే పరిశ్రమలోని మినీ కమాండ్ కంట్రోల్రూంకు అనుసంధానించాలన్నారు.

# పురుడు పోసేవారేరీ..!




కోదాడ :ఇది కోదాడ వంద పడకల ఆస్పత్రిలోని రోగుల వార్డు. గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 750 మందికిపై పైగా గర్భిణులు వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో సాధారణ ప్రసవాలు 126, సిజేరియన్ 69 వెరసి 195 మాత్రమే కాన్పులు జరిగాయి. మిగతా 500 మంది ఇతర ఆస్పత్రులకు వెళ్లి ప్రసవాలు చేయించుకోవాల్సిన దుస్థితి. వీరిలో 300 మంది ప్రైవేటుకు వెళ్లినట్లు అంచనా. ఇలా ఒక్కొక్కరికి రూ.50 వేలు ఖర్చు వస్తే రూ.1.50 కోట్లు నష్టపోయినట్లే. ఈ లెక్కన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందక జిల్లా వ్యాప్తంగా ప్రజలు రూ.కోట్లల్లో చికిత్సలకు ఖర్చు పెడుతున్నారు. ఇందుక్కారణం స్త్రీవైద్య నిపుణులు లేకపోవడమేననే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

పేరుకు వంద పడకల ఆస్పత్రులు అవి.. గర్భిణులు కాన్పులకు వస్తే దవాఖానాలే ప్రసవ వేదన అనుభవిస్తున్నాయి. స్త్రీ వైద్యనిపుణులు లేక ఇతర ఆస్పత్రులకు పంపిస్తుండటం గమనార్హం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలని అధికారులు ఆదేశాస్తున్నా అమలు కావడంలేదు.

తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ముప్పై పడకల ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచి భవన నిర్మాణం పనులు నిర్వహిస్తున్నారు. కానీ ఆశించిన మేర వైద్యసేవలు అందటం లేదు. ముఖ్యంగా ప్రసవాలు, శస్త్రచికిత్సలు లేకపోవటంతో గర్భిణులు, రోగులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

గడిచిన మూడు నెలల్లో 168 మంది గర్భిణులు ఆస్పత్రికి రాగా మూడంటే మూడే ప్రసవాలు జరిగాయి. అవి కూడా సాధారణ కాన్పులే కావడం గమనార్హం.

ఆసుపత్రిలో 24 గంటల పాటు వైద్యులు సేవలు అందిస్తున్నారు. ప్రసవాల నిర్వహణకు శిక్షణ పొందిన నర్సుల బృందం, సహాయకులు, పిల్లల వైద్యుడు అందుబాటులో ఉన్నారు. కొన్ని వసతులున్నా ప్రసవాలు మాత్రం ఆశించిన మేర జరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**గైనకాలజిస్టు లేకపోవడమే పెద్ద సమస్య**

డాక్టరు నిర్మల్కుమార్, సూపరింటెండెంట్, తుంగతుర్తి

ఆసుపత్రిలో కాన్పులు జరగాలంటే గైనకాలజిస్టులు ఉండాలి. స్త్రీవైద్య నిపుణులు లేకపోవటంతో ఇక్కడ ప్రసవాల సంఖ్య తక్కువ ఉంది. దీంతో గర్భిణులు కూడా ఇక్కడ ప్రసవాలకు వచ్చేందుకు విముఖత చూపుతున్నారు. కాన్పుల కోసం వచ్చిన వారికి ప్రేరణ కల్పిస్తున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో సూర్యాపేటకు తరలిస్తున్నాం.

# రంగాపురంపై.. కన్నేశారు..!



రంగాపురం :ముఖ్యంగా రంగాపురంలోని సర్వే నెంబరు 19, 20, 85, 86లు జాతీయ రహదారికి ఆనుకొని ఉండటంతో సదరు సర్వే నెంబర్లలోని భూదాన్ భూములను ఒప్పందం పేరిట నోటరీ చేసుకొని వ్యాపారాలు నడుపుతున్నారు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లోపమో..రాజకీయ నాయకుల ఒత్తిల్లో తెలియదు కానీ ప్రభుత్వం నిరుపేదలకు సాగు చేసుకోవడానికి ఇచ్చిన వ్యవసాయ భూములు వ్యాపారుల చేతుల్లోకి చేరి బహుళ నిర్మాణాలు వెలుస్తుండటంతో గ్రామపంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది.

బీబీనగర్ మండలం రంగాపురం రెవెన్యూలో దాదాపు భూదాన్భూములే ఉన్నాయి. ప్రతిష్ఠాత్మక ఎయిమ్స్ ఆసుపత్రి సింహ భాగం రంగాపురం రెవెన్యూ పరిధిలోనే ఉంది. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారి 163 కూడా ఇదే గ్రామం గుండా ఉంది. ఇక్కడి భూముల విలువ రూ.కోట్లలో ఉంటుంది. వ్యాపారులు రంగాపురంలోని భూదాన్భూములపై కన్నేశారు. జాతీయ రహదారి వెంట నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఏడాది కాలంలో రహదారికి ఆనుకొని సుమారు 20 వరకు వ్యాపార సంస్థలు ఏర్పాటు చేశారంటే ఆక్రమణ ఏ స్థాయిలో జరుగుతుందో వేరే చెప్పనక్కర్లేదు.

రెవెన్యూ చట్టం నిబంధనల ప్రకారం భూదాన్భూముల్లో ఎలాంటి కట్టడాలు కట్ట కూడదు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అనుమతులు లేనిదే నిర్మాణాలు చేపట్టకూడదు. ట్రాన్స్కో పంచాయతీ అనుమతులు లేనిదే విద్యుత్తు మీటర్ ఇవ్వకూడదు కానీ ఇవేవి లేకుండానే వ్యవసాయం చేసుకునేందుకని పేదలకు ఇచ్చిన భూములు వ్యాపార సంస్థలకు అడ్డాలుగా తయారయ్యాయి. పంచాయతీ, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు ఉండటంతో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టిన వ్యాపారులు శాశ్వత నిర్మాణాల వైపు అడుగులు వేస్తున్నారు.

**నోటీసులు అందజేశాం**

జాకీర్, పంచాయతీ కార్యదర్శి, బీబీనగర్

ఎయిమ్స్ ఆసుపత్రి పక్కన రంగాపురం పరిధిలో రహదారి వెంట నిర్మాణాలు చేపడుతున్న, వ్యాపారాలు నడిపిస్తున్న వారికి గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతూ వ్యాపార కార్యకలాపాలు జరుపుతున్నారు. దాదాపు నిర్మాణాలు చేపట్టిన వారందరికి నోటీసులు అందించాం. కలెక్టర్కు కూడా నివేదించాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటాం.

**ఆదేశాలు రాగానే చర్యలు**

శ్యామ్సుందర్రెడ్డి, తహసీల్దార్, బీబీనగర్

అక్రమ నిర్మాణాలు జరగకుండా గ్రామపంచాయతీ అధికారులు చూడాలి. భూదాన్ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధం. వీటిని తొలగించాలని అధికారుల నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటాం.

# అభివృద్ధి దాతలు.. ఊరికి ఉపకారులు

ఏన్కూరు : ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో పలు శాఖలకు భవనాలు మంజూరు చేస్తున్నా స్థలాలు లేక చాలా చోట్ల నిధులు వెనక్కి పోతున్న పరిస్థితులున్నాయి. కానీ ఏన్కూరు మండలం బురద రాఘవాపురంలో మాత్రం బడి, గుడి, ఆసుపత్రి ఇలా ఏదైనా మంజూరైతే పోటీగా స్థలదాతలు ముందుకు వస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా గ్రామానికి చెందిన దాతలు సేవాభావంతో విలువైన భూములు విరాళంగా అందించి గ్రామస్థులకు అండగా నిలుస్తున్నారు.

**స్థలాలు ఇచ్చి.. భవనాలు నిర్మించారు**

25 ఏళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలకు కొండపల్లి వెంకటరామారావు, సుగణమ్మ దంపతులు రూ.లక్షల విలువ చేసే మూడెకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆరంభంలో ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న ఇక్కడ స్థలం ఎక్కువగా ఉండటంతో ఉన్నత పాఠశాలగా అప్గ్రేడ్ చేశారు. వారి స్ఫూర్తితో బొగ్గవరపు సీతారామయ్య అనే దాత కళావేదిక నిర్మించారు. పూర్వ విద్యార్థి డా.శెట్టిపల్లి నాగేశ్వరరావు పిల్లలకు అవసరమైన ఇనుప బల్లాలు అందజేశారు.

ఆరోగ్య ఉపకేంద్రం మంజూరు కాగా ఆ గ్రామానికి చెందిన కనిశెట్టి వెంకన్న నాలుగు గుంటల భూమిని ఇచ్చారు. ఉపకేంద్రంతో పాటు ఇక్కడే పల్లె దవాఖానా సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి మందనపు ఇందిరమ్మ మూడు గుంటల భూమిని విరాళం ఇచ్చారు. ప్రస్తుతం రెండు కేంద్రాలు పిల్లలకు అందుబాటులో ఉండే విధంగా నిర్వహిస్తున్నారు.

ఇటీవల రూ.20 లక్షలతో రెండు గ్రామ సమాఖ్య భవనాలు మంజూరు కాగా బండ్ల సత్యవతి ఆమె కుమారుడు లెనిన్ నాలుగు గుంటల భూమిని ఇచ్చారు. రూ.కోటిన్నర ఖర్చుతో గ్రామస్థులంతా ఊరికి ముఖద్వారం(ఆర్చి), రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం నిర్మిస్తున్నారు. ముత్యాలమ్మ ఆలయం కూడా నిర్మించారు.

గ్రామంలోనూ చేపట్టే పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమంలోనూ సమష్టిగా ముందుకొస్తూ మండలంలో ప్రత్యేకత చాటుతున్నారు. ఇక్కడ శివాలయంలో ఏటా జిల్లాలోనే ప్రత్యేకంగా అయ్యప్ప పడిపూజ, సుబ్రహ్మణ్యస్వామి కావిడిసేవ, శివుడి అభిషేకాలు చేపడతున్నారు.

# ఆశ చూపారు.. దోచేశారు..!

ఖమ్మం : రెండేళ్లుగా మిరప రైతులను నష్టాలే వెక్కిరించాయి. ఈసారి కొద్దిగా ధర పెరుగుతుందనుకుంటే దిగుబడులు పడిపోయాయి. తేజ రకం మిరప క్వింటాకు గరిష్ఠ ధర రూ.21,150 పలికిందని తెలుసుకున్న అన్నదాతలు.. 20వేల మిరప బస్తాలను ఖమ్మం మార్కెట్కు తీసుకొచ్చారు. జెండాపాటలో గరిష్ఠంగా రూ.20,100 ఉంటే రూ.15–16వేల మధ్య కొనటానికి వ్యాపారులు ప్రయత్నించటంతో కర్షకులు ఆందోళనకు దిగారు. ధరల విషయంలో పర్యవేక్షణ కొరవడటంతో ఖరీదుదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని నినదించారు. శీతల గిడ్డంగుల్లో పేరుకుపోయిన కొందరి వ్యాపారుల ఏసీ మిరపకు ధరలు పెంచి.. ఎక్కువ సరకు మార్కెట్కు వచ్చేలా చేసి తమను నట్టేట ముంచుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. 'మూడురోజుల సెలవుల అనంతరం కొనుగోళ్లు జరిగే మంగళవారం నుంచి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని ఖమ్మంజిల్లా మార్కెటింగ్శాఖ అధికారి అలీం తెలిపారు. ధరల పెరుగుదల అంతర్జాతీయ మార్కెట్పై ఆధారపడి ఉంటుందని, ఖరీదుదారులు కుమ్మక్కు కాలేదని చెప్పారు.

ఆరుగాలం శ్రమించి పండించిన మిరప పంట మార్కెట్కు చేరింది. జెండా పాటలో క్వింటా రూ.19,500కు కొంటానని వ్యాపారి తెలిపారు. రైతు సంతోషపడి ఇంటికి సమాచారం చేరవేశారు. ఇంతలో వ్యాపారి వచ్చి కాయలు కొంచెం మెత్తగా ఉన్నాయి.. మరో రూ.1,000 తగ్గిస్తానని చెప్పారు. మళ్లీ కాసేపు అటూఇటూ తిరిగి, సంప్రదింపులు జరిపొచ్చి.. 'చివరి బస్తా నాణ్యంగా లేదు. అన్నీ అలాగే ఉన్నట్లున్నాయి. మొత్తంగా 20 కిలోలు కోతపెడతా.. లేకుంటే రూ.16వేలకు కొంటాం. ఇష్టం లేకుంటే తీసుకెళ్లండి' అంటూ కటువుగా చెప్పారు. ఇదీ ఒక్క రైతుకు ఎదురైన చేదు ఘటన కాదు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఇలాంటి పరిస్థితులతో వందలాది మంది కర్షకులు శుక్రవారం ఇబ్బందులు పడ్డారు. ఖరీదుదారులు కుమ్మక్కై తమను నిలువునా మోసగిస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. చివరికి నిర్ణయించిన ధర కంటే కొంచెం పెంచుకోగలిగారు.

33 బస్తాల మిరప తీసుకొచ్చా. మొదట వ్యాపారులు క్వింటాకు రూ.19వేలు ఇస్తామన్నారు. కాసేపటికి రూ.1,000 తగ్గించారు. మళ్లీ వచ్చి రూ.17వేలకు కొంటామన్నారు. ధర్నా చేసిన తరువాత రూ.18వేలకు కొన్నారు.

తాళ్లూరి శేషయ్య, చిరుమర్రి, ముదిగొండ మండలం

14 బస్తాల మిరపను మార్కెట్కు గురువారం తీసుకొస్తే క్వింటాకు రూ.18,500 చెల్లిస్తామన్నారు. గరిష్ఠ ధర కంటే రూ.2,650 తగ్గటంతో విక్రయించలేదు. శుక్రవారం అదే మిరపను రూ.15,500కు కొంటామన్నారు. గతేడాది ఎకరంన్నరకు 45 క్వింటాళ్ల దిగుబడి వస్తే, ఈసారి రెండెకరాల్లో 15 క్వింటాళ్లే పండింది. నష్టానికి సరకును అమ్ముకోను. సాదు లక్ష్మణ్రావు, ముద్దునూరు, తల్లాడ మండలం

# రూ.కోట్లతో కట్టారు.. పక్కన పెట్టారు..

నిజామాబాద్ : గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్యామాప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకం కింద నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు రూ.కోట్ల నిధులను కేటాయించాయి. ఈ నిధులతో చేపట్టిన భవనాల నిర్మాణాలు, ఇతర పనులు కొన్నేళ్ల క్రితమే పూర్తయ్యాయి. అధికారులు, పాలకులు వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో రూ.కోట్ల ప్రజాధనం మట్టిపాలవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నిజామాబాద్ జిల్లాలోని ఎడపల్లి మండలంలో రూర్బన్ పథకం కింద రూ.25 కోట్లతో 316 పనులు చేపట్టారు. గుత్తేదారులు ఎక్కువ మొత్తంతో అంచనాలు రూపొందించినా, తక్కువ డబ్బుతో పనులు పూర్తి చేశారు. ఫలితంగా రూ.4 కోట్లు ఆదా అయ్యాయి. మిగిలిన డబ్బుతో ఇతర పనులను చేపట్టే వీలులేకపోవడంతో అవి వెనక్కి వెళ్లిపోయాయని అధికారులు చెబుతున్నారు. అయితే, పూర్తయిన పనులనూ అధికారులు, ప్రజాప్రతినిధులు దాదాపు నాలుగేళ్లుగా ప్రారంభించలేకపోతు న్నారు.ఎడపల్లి మండల కేంద్రంలో రూ.1.34 కోట్లతో తాగునీటి పైప్లైన్ ఏర్పాటు చేసి ప్రతీ ఇంటికి నల్లాను బిగించారు. రూ.57 లక్షలతో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని నిర్మించారు. రూ.కోటి వెచ్చించి మినీ ఆడిటోరియం నిర్మాణాన్ని పూర్తిచేశారు. రూ.50 లక్షలతో చేపలు, కూరగాయల విక్రయ కేంద్రాలు నిర్మించారు. అలీసాగర్లో రూ.25 లక్షలతో దుకాణ సముదాయాల భవనాలు నిర్మించారు. నాలుగేళ్ల నుంచి ఇవి వృథాగానే పడి ఉన్నాయి.

కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో 381 పనులకు రూ.184 కోట్లు వెచ్చించారు. వాటిలో రూ.90 లక్షలతో ఏర్పాటు చేసిన పౌర సేవా కేంద్రాలు, రూ.90 లక్షలతో నిర్మించిన నైపుణ్య శిక్షణ కేంద్రం, రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేసిన ఆడిటోరియం నాలుగు సంవత్సరాల నుంచి ఉపయోగంలో లేవు.

కొత్త పాలకవర్గంపై ఆశలుశ్యామాప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 70 శాతం, కేంద్ర ప్రభుత్వం 30 శాతం నిధులను సమకూర్చుతుంది. రెండు ప్రభుత్వాలు నిధులు కేటాయించడంలో చూపిన శ్రద్ధ ఆ నిధులతో చేపట్టిన పనుల ప్రారంభంలో చూపకపోవడంలో ఆంతర్యమేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల కొత్తగా ఎన్నికైన గ్రామపంచాయతీల పాలకవర్గ సభ్యులైనా వీటి ప్రారంభంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తెస్తాం– సాయాగౌడ్, డీఆర్డీఓ, నిజామాబాద్

## సాహితీ వేడుక.. విజ్ఞాన వేదిక

హైదరాబాద్: వాతావరణంపై చర్చలు.. పుస్తక పరిచయాలు.. సాంస్కృతిక ప్రదర్శనలు.. కార్యశాలలు.. చిన్నారులు, యువతను ఆకట్టుకునే కార్యక్రమాలు.. అందరినీ ఆలోచింపజేసే చర్చాగోష్ఠులు.. వీటన్నింటికీ వేదిక హైదరాబాద్ సాహితీ పండగ (హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్–హెచ్‌ఎల్‌ఎఫ్). టీ–హబ్ సమీపంలో సత్వ నాలెడ్జ్ సెంటర్లో శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అనేక విజ్ఞానపరమైన అంశాలకు హెచ్‌ఎల్‌ఎఫ్ వేదిక కానుంది. వేడుకను ఉదయం 10 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లాంఛనంగా ప్రారంభిస్తారు. నోబెల్ పురస్కార గ్రహీతలు అభిజిత్ బెనర్జీ (ఆర్థికశాస్త్రం ), కైలాశ్ సత్యార్థి (శాంతి) పలు చర్చల్లో పాల్గొననున్నారు. ఉచిత





ప్రవేశం మెట్రోస్టేషన్ నుంచి ఉచిత ప్రయాణాన్ని కల్పించారు.

**300 మంది వ్యాఖ్యాతలు..**

'లాంగ్వేజ్ ఇన్ ఫోకస్'లో భాగంగా ఈ ఏడాది కశ్మీర్ భాషను ఎంచుకున్నారు. ఆ భాష ప్రత్యేకత తెలిపేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చలు ఉంటాయి. ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, సింగపూర్, ఇంగ్లండ్, అమెరికా దేశాలతోపాటు మన దేశంలో పలు రంగాల్లో నిష్ణాతులైన సుమారు 300 మంది వ్యాఖ్యాతలు పాల్గొంటున్నారు. వాతావరణ మార్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు, కవిత్వం, సాహిత్యంపై ప్రత్యేక కార్యక్రమాలుంటాయి. రచయితలు తమ పుస్తకాలను పరిచయం చేయనున్నారు. 'యంగిస్థాన్ నుక్కడ్' పేరుతో యువత కోసం ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి.

## ప్రయోజనం... పరిహారం

హైదరాబాద్: ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో భూములు, స్థిరాస్తులు కోల్పోతున్న బాధితులకు ప్రయోజనకరంగా పరిహారాన్ని అందజేస్తోంది. చ.గజానికి రూ.90 వేల చొప్పున చెల్లిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి తూంకుంట వరకూ 18 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ను నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మేడ్చల్ జిల్లాలో 5.5 కిలోమీటర్ల పరిధిలో ప్రైవేటు ఆస్తులను, పట్టాభూములను సేకరిస్తున్నారు. భూములు, ఇళ్లు కోల్పోతున్నవారు తమకు పరిహారం తక్కువగా ఇస్తున్నారని, భవిష్యత్తులో ఆస్తుల విలువ పెరగనున్నందున పరిహారం పెంచాలంటూ అభ్యర్థించారు. దీంతో రెవెన్యూ అధికారులు 2015, 2017 రెవెన్యూ రికవరీ చట్టాలను సవరించి పరిహారాన్ని పెంచారు. మేడ్చల్కలెక్టర్ మనుచౌదరి భూబాధితులతో రెండురోజుల క్రితం మాట్లాడి పరిహారం చెక్కులను అందించారు. **ప్రస్తుత ధరలకు మూడింతలు.. అదనంగా మరింత**



భూములు, ఇళ్లు కోల్పోతున్నవారికి భూమి ధరకు మూడింతలు అదనంగా రూ.15 వేలు లెక్కగట్టి ఇస్తున్నారు. ప్రస్తుతం అక్కడ చ.గజం రూ.25 వేలు ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. హకీంపేట, దేవరయాంజాల్, లోతుకుంట, తూంకుంట, అల్వాల్, పోతేపల్లి గ్రామాల్లో రహదారులకు రెండువైపులా వారి భూములు, ఇళ్లున్నాయి. భూ యజమానుల సమక్షంలో సైట్ ఇంజినీరింగ్ సర్వే నిర్వహించారు. స్థలం విలువతోపాటు భవన నిర్మాణ వ్యయాన్ని కలిపి విలువను లెక్కగట్టారు. అనంతరం జిల్లా స్థాయి చర్చల కమిటీ ప్రతినిధులు అంతా కలిసి చదరపు గజం రూ.90వేలుగా నిర్ణయించారు. అనంతరం రెండు రోజుల క్రితం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. విడతల వారీగా భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారాన్ని అందజేయనున్నారు.

## చెత్త వేశారో.. జరిమానా వేస్తారు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో పారిశుద్ధ్యం కోసం ఎన్ని నిధులు వెచ్చించిన ఆశించిన మేర ప్రయోజనం లేదని పుర అధికారులు గుర్తించారు. దీంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పారిశుద్ధ్యం నిబంధనలు అతిక్రమించిన వారిపై నిఘా ఉంచి కేసులు పెడుతున్నారు. పట్టణంలోని డాక్టర్స్ కాలనీ, అద్దంకి నార్కట్పల్లి బైపాస్ రహదారిపై, పలు ప్రధాన కూడళ్లలో నిత్యం కొందరు నిర్లక్ష్యంగా వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దంకి బైపాస్ వెంబడి ఇళ్లలోని మరుగుదొడ్ల వ్యర్థాలు శుభ్రం చేసే వాహనాల వారు రాత్రి సమయంలో వ్యర్థాలు పోస్తున్నారు. పురపాలిక కమిషనర్గా జి.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ



ఉల్లంఘనలకు ముకుతాడు వేయాలని నిర్ణయించారు. డాక్టర్స్ కాలనీ, అద్దంకి రహదారి వెంబడి ఇటీవల సీసీ కెమెరాలను అమర్చారు. వీటిని నిత్యం ఓ పారిశుద్ధ్య జవాను పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు పోస్తే కెమెరాల ఆధారంగా పోసిన వారిని గుర్తిస్తున్నారు. ఇటీవల కృష్ణా కాలనీలో రాత్రి సమయంలో వ్యర్థాలు తెచ్చి పోస్తున్న వారిని ద్విచక్ర వాహనాల నంబర్ల ఆధారంతో గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుర అధికారుల చర్యలతో ఉల్లంఘనలకు పాల్పడే వారు భయపడుతున్నారు.

నిత్యం సీసీ కెమెరాలతో పరిశీలిస్తున్నామని, పట్టణ వాసులు పురపాలిక ట్రాక్టర్లు, ఆటోల్లోనే చెత్త వేయాలని పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి వెంకటరమణ కోరారు.

# కొలువులు ఇచ్చి.. నష్టాలు పెంచేసి



హయత్నగర్: రైతుల నుంచి సేకరించిన 24 గంటల వ్యవధిలోనే వినియోగదారుడికి నాణ్యమైన పాలు అందించడమే నార్మ్మల్ మదర్ డెయిరీ లక్ష్యం.. స్వచ్ఛమైన ఆ తెల్లని పాలకు రాజకీయ రంగు అలుముకుంది. పోటాపోటీగా ఆయా పార్టీల నాయకులు గ్రామ స్థాయిలో..మొదలు రాష్ట్ర స్థాయి వరకూ జోక్యం చేసుకొని అవసరం లేకపోయినాఉద్యోగాలిప్పించుకున్నాయి. నష్టాల ఊబిలోకి కూరుకుని పోయేలా చేశాయి. రైతులకు పాల బిల్లులు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

**రైతులకు బకాయిలు:** దిల్లీ మదర్ డెయిరీతో మార్కెటింగ్ ఒప్పందం రద్దయిన తర్వాత పాలక మండళ్ల అవగాహనలేమితో ఆదాయానికి మించిన నిర్వహణ భారం పెరిగి 10 ఏళ్లలో బ్యాంకు రుణాలు రూ.35.15 కోట్లకు చేరాయి. ఏడాదికి రూ.4 కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. రైతులకు నాలుగు నెలలుగా పాల బిల్లులు రూ.23 కోట్లు పెండింగ్లో ఉన్నాయి. ఉద్యోగులకు తొలిసారిగా ఈ నెలలో సగం వేతనం చెల్లించారు.

**నిర్ణయలోపంతోనే:** 2015లో అమూల్ పాలు (ప్యాకింగ్) చేసేందుకు వీలుగా నార్మ్మల్ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం.. దిల్లీ మదర్ డెయిరీకి రుచించలేదు. మార్కెటింగ్ ఒప్పందం రద్దు చేసుకుంది. నార్మ్మల్ మదర్ డెయిరీ బ్రాండ్తో తిరిగి మార్కెట్లోకి వెళ్లినా, పోటీ తట్టుకోలేక చతికిల పడిపోయింది.

**ఒక వంతు పనికి..** మూడొంతుల సిబ్బంది: డెయిరీ లాభాల్లో నడుస్తున్న సమయంలో మితిమీరిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల జోక్యం, పాలక మండళ్ల గొప్పల కోసం ముందువెనుకా చూడకుండా ఉద్యోగులను నియమించేసుకుంది. ఆ ఉద్యోగులే సంస్థకు భారమయ్యారు. పాల సేకరణ ఉన్నా అమ్మకాలు తగ్గిపోయాయి. మిగిలిన పాలను పొడర్గా మార్చేందుకు లీటరకు రూ.15 చొప్పున అదనపు ఖర్చు చేయాల్సి వచ్చింది. సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో 32 వేల నుంచి 25 వేలకు పాడి రైతుల సంఖ్య తగ్గిపోయింది.

గట్టెక్కించే ప్రయత్నంలో ఉన్నాం..: బి.కృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ నార్మ్మల్ మదర్ డెయిరీ

డెయిరీ నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడం. వేయి లీటర్లలోపు వచ్చే చిల్లింగ్ సెంటర్లను మూసివేసి, సమీపంలోని కేంద్రాలోసేకరణ చేయనున్నాం. పాల అమ్మకాలను పెంచుకోనున్నాం. రెట్టింపు ఉన్న ఉద్యోగులను సక్రమంగా వినియోగించుకుంటాం.

## ఒత్తిడిని జయించేలా.. ఓటమిని అధిగమించేలా..



బొంరాస్పేట: విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ర్యాంకులు, మార్కుల వేటలో విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లకు అడ్డుకట్ట వేసేలా మార్గదర్శకాలు జారీ చేసింది. వంద మందికి పైగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు శిక్షణ సంస్థలు, హాస్టళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా కౌన్సెలర్ను లేదా సైకాలజిస్టును నియమించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**పోటీ నెలకొని..**

ర్యాంకుల సాధనకు, ప్రవేశ పరీక్షల్లో నెగ్గేందుకు విద్యార్థుల్లో విపరీతమైన పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో వారిని తరగతి గదుల్లోనే రోజంతా చదివిస్తున్నారు. ఏటా ఫలితాలు వచ్చిన తరువాత అనుకూలంగా లేకుంటే కుంగుబాటుకు గురి కావడమో, లేదా ఆత్మహత్యలకు పాల్పడడమో చేస్తున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును కోల్పోవడంతో పాటు తల్లిదండ్రులకు వేదన మిగుల్చుతున్నారు. విద్యార్థుల్లోని మానసిక ఒత్తిడిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, మనసు మార్చడం వంటి చర్యల ద్వారా ఫలితాలు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. వారి మానసిక, ఆరోగ్య విధానాన్ని రూపొందించుకోవాలని విద్యాసంస్థలకు ప్రభుత్వం సూచించింది.

జిల్లా వివరాలు: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లన్నీ కలిపి సుమారు 1500లకు పైనే ఉన్నాయి. వీటిలో 1.50 లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారు.

**మార్గదర్శకాలు ఇలా**

పరీక్షల సమయంలో విద్యార్థులకు నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

మార్కులు, ర్యాంకుల ఆధారంగా బ్యాచ్లుగా విభజించరాదు.

మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. క్రీడలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే విద్యేతర కార్యక్రమాలు నిర్వహించాలి.

మానసిక సమస్యలను గుర్తించేందుకు బోధన, బోధనేతర సిబ్బంది మానసిక, ఆరోగ్య నిపుణులతో శిక్షణ పొందాలి.

భవనంపైకి ఎక్కి ముప్పు ఉన్న ప్రదేశాలకు వెళ్లకుండా నిషేధించాలి. బాల్కనీలకు గ్రిల్స్ బిగించాలి. ట్యాంపర్ ప్రూఫ్ సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి.

ఆదేశాలు రాగానే అమలు చేస్తాం: రేణుకాదేవి, డీఈఓ

వంద మంది విద్యార్థులకు మించి ఉన్న విద్యా సంస్థల్లో కౌన్సెలర్లను నియమించుకోవాలన్న విషయమై తమకు ఇంత వరకు లిఖితపూర్వక ఆదేశాలు రాలేదు. వస్తే అమలు చేస్తాం.

## గోదావరి ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం



హైదరాబాద్: మహానగరానికి తాగునీటిని అందించే కీలకమైన గోదావరి 2, 3 దశల ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం చుట్టారు. నగరానికి 307 ఎంజీడీల నీటిని తరలించడంతోపాటు మూసీ పునరుజ్జీవనం కోసం గోదావరి జలాల వినియోగం నేపథ్యంలో రూ.7,360 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్ట్ పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి జలాలను అందుబాటులోకి తెచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఘన్పూర్ వద్ద 15 టీఎంసీల నీటిని శుద్ధి చేసి నేరుగా వివిధ ప్రాంతాలకు సరఫరా చేయనుండగా.. మరో 5 టీఎంసీల నీటిని ఉస్మాన్సాగర్, హిమాయత్సాగర్కు తరలించనున్నారు. ఇందులో 2.5 టీఎంసీల నీటిని శుద్ధి చేసి వినియోగించుకోనుండగా మరో 2.5 టీఎంసీల నీటిని మూసీ పునరుజ్జీవనానికి వినియోగించనున్నారు.

**నెలవారీగా లక్ష్యాలు..**

పనులను 17 నెలల్లో పూర్తి చేసేలా కాంట్రాక్ట్ సంస్థలకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించనున్నామని జలమండలి ఎండీ కె.అశోక్రెడ్డి తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు 8న ముఖ్యమంత్రి గోదావరి జలాల ప్రాజెక్ట్కు శంకుస్థాపన చేశారు. మల్లన్నసాగర్ నుంచి నీటిని పంపింగ్ చేయనున్నారు. మల్లన్నసాగర్ వద్ద పంప్హౌస్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. మల్లన్నసాగర్ వద్ద నుంచి ఘన్పూర్ వరకు 50 కిలోమీటర్ల మేర 3000 ఎంఎం పైపులైన్లను రెండు వరుసల్లో ఏర్పాటు చేయనున్నారు. ఘన్పూర్ వద్ద భారీ నీటి శుద్ధి ప్లాంట్ పనులు చేపట్టనున్నారు. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన ముందస్తు పనులు చేపడుతున్నారు. హిమాయత్సాగర్ వద్ద నిర్మించే ప్లాంట్ పనులకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏకకాలంలో ఈ పనులు కొనసాగేలా జలమండలి ప్రాజెక్ట్ విభాగం ఇంజినీర్లు నిర్మాణ సంస్థలతో చర్చించారు. మల్లన్నసాగర్ నుంచి ఘన్పూర్ వరకు 50 కిలోమీటర్ల మేర పైపులైన్ రహదారులు, భవనాల శాఖ ప్రధాన రహదారి వెంట ఏర్పాటు కానుంది. సుమారు రూ.120 కోట్లు చెల్లించాలని ఆర్అండ్బీ కోరుతున్న నేపథ్యంలో జలమండలి, ఆర్అండ్బీ మధ్య పనులు, పరిహారానికి సంబంధించిన అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. హైబ్రీడ్ యాన్యుటీ విధానంలో చేపడుతున్న ప్రాజెక్ట్ ఎంత త్వరగా పూర్తయితే నగరంలో నీటి సమస్యకు అంత త్వరగా పరిష్కారం లభించనుంది. 2028 వరకు తాగునీటి అవసరాలను పూర్తిగా తీర్చడంతో పాటు నగర విస్తరణకు అనుగుణంగా నీటి సరఫరాకు అవకాశం కలగనుంది.

## మంత్రి హామీ.. చిగురిస్తున్న ఆశలు

జమ్మికుంట : జమ్మికుంట రైల్వేస్టేషన్ను అమృత్ భారత్ పథకంలో చేరుస్తాం. ఆధునికీకరణకు లేదా ప్రత్యేక నిధులతో స్టేషన్లో అభివృద్ధి పనులను చేయిస్తా. మరిన్ని ఎక్స్ప్రెస్ రైళ్ల హాల్టింగ్కు కృషి చేస్తాను. ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్న మాటలివి.జమ్మికుంట రైల్వేస్టేషన్ నుంచి నిత్యం 10 వేల మంది రైళ్లలో రాకపోకలు సాగిస్తారు. వీరితో ఆ శాఖకు నెలకు రూ.30 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఎన్ఎస్జీ(నాన్ సబ్అర్బన్ గ్రేడ్)–5 స్టేషన్ కాగా.. కేవలం 11 ఎక్స్ప్రెస్ రైళ్లే ఆగుతున్నాయి. సికింద్రాబాద్, బల్లార్షా, విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లకు హాల్టింగ్ లేకపోవటంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కాజీపేట, హైదరాబాద్లకు వెళ్లి ప్రయాణిస్తున్నారు. మంత్రి హామీతో ప్రయాణికుల కష్టాలు ఏ మేరకు తీరుతాయో చూడాలి.

**ఇలా చేస్తే బాగు..**

ప్లాట్ఫామ్ను నం–1 వైపు పొడిగించకపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్టార్టర్ సిగ్నల్ దాకా లేక ఇంజన్ తర్వాత బోగిలోకి దివ్యాంగులు వెళ్లలేని పరిస్థితి ఉంది. రెండో నంబర్ ప్లాట్ఫామ్పైన ఇరువైపులా పూర్తిస్థాయిలో రేకులు(కవరింగ్) అమర్చక



ప్రయాణికులు ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా నిలబడుతున్నారు. సాధారణ ప్రయాణికులు వేచి ఉండే గది పరిమితి పెంచాలి.

స్టేషన్లో లిఫ్ట్ సౌకర్యం లేకపోవటంతో వృద్ధులు, దివ్యాంగులు, పిల్లాపాపలతో ఫుట్ ఓవర్ వంతెనపై వెళ్లటం పరీక్షగా మారింది. ఒకటో నంబరు ప్లాట్ఫామ్పై నుంచి మరో ప్లాట్ఫామ్కు వెళ్లేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు అంటున్నారు.

కొత్తపల్లి వైపు ఫుట్ ఓవర్ వంతెన లేక పట్టాల పైనుంచి, ఆగిన రైళ్ల కింది నుంచి వెళ్తున్నారు.

జీటీ(న్యూదిల్లీ–చెన్నై), దిల్లీ వెళ్లే తెలంగాణ ఎక్స్ప్రెస్, దానాపూర్(వారణాసి) వైపు, రప్తిసాగర్, కోర్బా, పుణే ఎక్స్ప్రెస్ రైళ్లను జమ్మికుంటలో ఆపాలని కేంద్ర మంత్రులను విన్నవించారు.

**పోలీస్ స్టేషన్తో రక్షణ**

స్టేషన్లో కుళాయిలు, మరుగుదొడ్లలోని పరికరాలు గుర్తుతెలియని వ్యక్తులు పలుమార్లు ధ్వంసం చేశారు. జమ్మికుంట పరిసర ప్రాంతాల్లో రైళ్ల కిందపడి పలువురు మృతి చెందిన ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. పంచనామాకు కాజీపేట, రామగుండం లేదా మంచిర్యాల నుంచి రైల్వే పోలీసులు వస్తున్నారు. రైల్వే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే భద్రత సౌకర్యాలు మెరుగుకానున్నాయి.

## కాలువ మట్టి.. అక్రమార్కులు కొల్లగొట్టి

గంగాధర: ఎస్సారెస్పీ కాలువలకు ఆనుకుని ఉన్న కట్టమట్టిపై అక్రమార్కులు కన్నేశారు. వరద కాలువకు రక్షణగా ఉండాల్సిన మట్టిని రాత్రనక, పగలనక దోచేస్తున్నారు. ఎవరు అడగరనే ధీమాతో కొల్లగొడుతూ జేబులు నింపుకొంటున్నారు. గంగాధర, రామడుగు, మల్యాల, బోయినపల్లి మండలాలతోపాటు చాలా ప్రాంతా ల్లో రేయింబవళ్లు ఇదే పనిగా విలువైన మట్టిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేయడంలో మతలబు ఉందోననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**మూడు జేసీబీ యంత్రాలు, ఆరు టిప్పర్లు..**

జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని వివిధ గ్రామాల మీదుగా 137 కి.మీ పొడవునా వరద కాలువకు ఇరువైపులా ఉన్న కట్టలకు సరైన రక్షణ కొరవడుతోంది. ఆయా గ్రామాలకు అనుకుని ఉన్న ఈ ప్రాంతంలో 60 అడుగుల నుంచి 100 మీటర్ల వరకు స్థలం ఉండగా ఎత్తైన మట్టి కట్టలున్నాయి. కాలువ నిర్మాణ సమయంలో తీసిన మట్టి ఇరువైపులా పోయడంతో కాలువకు రక్షణగా ఉంటున్నాయి. నీటి ప్రవాహానికి అండగా ఉండే ఇవి కాలక్రమేణా రూపు కోల్పోతున్నాయి. మూడు జేసీబీ యంత్రాలు, ఆరు టిప్పర్లు అన్న చందంగా అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది.

**తరుగుతున్న సంపద.. ఆదాయానికి గండి**

నిబంధనల మేరకు ఎక్కడైనా మట్టిని తవ్వాలంటే భూగర్భగనుల



శాఖతోపాటు సాగునీటి, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలి. కానీ దీన్ని ఉల్లంఘించి కాలువ మట్టిని కొల్లగొడుతున్నారు. కొంత రుసుం నామమాత్రంగా చెల్లించి అధిక మొత్తంలో తరలిస్తున్నారు. వాస్తవానికి కాలువ పక్కన మట్టి తరలించేందుకు అనుమతి ఇవ్వడమనేది కుదరదు. కానీ కరీంనగర్, రేకుర్తి, కొత్తపల్లి పట్టణాలతోపాటు గంగాధర, రామడుగు, ఇతర ప్రాంతాల్లోని స్థిరాస్తి వ్యాపారంలో భాగంగా వెంచర్లతోపాటు కొత్తగా చేపట్టిన ఇళ్ల నిర్మాణానికి మట్టిని తరలిస్తున్నారు. స్థానికంగా టిప్పర్ మట్టికి రూ.2500 వసూలు చేస్తుండగా దూరప్రాంతాలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నారు. రాజకీయ నాయకుల ప్రమేయంతో అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.వరద కాలువ మట్టి తరలించాక వచ్చిన బండరాళ్లపై క్రషర్ వ్యాపారులతో పాటు అక్రమార్కుల కన్ను పడింది. రాళ్లు తరలించి కంకరగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. కురిక్యాల, న్యాలకొండపల్లి, తాడిజెర్రి, రంగారావుపల్లి గ్రామాల్లోని వరద కాలువకు చాలాచోట్ల రాళ్లు తరలించి మట్టిని వదిలేశారు. బండరాళ్లు తరలిస్తూ ఇళ్ల నిర్మాణానికి అమ్ముకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. బండరాళ్లు, మట్టి తరలించగా ఏర్పడ్డ ఖాళీ స్థలాలను సమీపంలోని కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు.

# పాలనలో.. 12 మంది ఐఏఎస్‌లు

హైదరాబాద్: తెలంగాణ కేంద్ర పట్టణ ప్రాంతం(టీసీయూఆర్) పరిధికి జీహెచ్‌ఎంసీని విస్తరించడంతో.. అంతే స్థాయిలో నగరాన్ని అభివృద్ధి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర?యాలు తీసుకుంది. డివిజన్ల పునర్విభజన, పరిపాలన కేంద్రాల పునర్ వ్యవస్థీకరణ పూర్తి చేసి.. ఇప్పటివరకు గ్రూప్-1, గ్రూప్-2 స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్లుగా ఉన్న ప్రాంతాలకు.. ఐఏఎస్ అధికారులను జోనల్ కమిషనర్లుగా నియమించింది. పాతబస్తీ, ప్రధాన నగరం, సైబరాబాద్ అనే తేడా లేకుండా.. 12 జోన్లలో 9 జోన్లను యువ ఐఏఎస్‌లకు అప్పగించింది. తాజాగా మరో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను అదనపు కమిషనర్లుగా నియమించడంతో.. కమిషనర్ ఆర్వీ.కర?న్‌తో కలిపి ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలోని ఐఏఎస్ అధికారుల సంఖ్య 12 మందికి పెరిగింది. దేశంలో ఇంతమంది ఐఏఎస్ అధికారులున్న స్థానిక సంస్థ మరెక్కడా లేదు.

**ఆ ఇద్దరు.. అందుకేనా..?**

ప్రస్తుత జీహెచ్‌ఎంసీ మూడు మహా నగరపాలక సంస్థలుగా ఏర్పాటు కానుందని సమాచారం. మూడు మహా నగరాల ఏర్పాటును దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా మల్కాజిగిరి, ఎల్బీనగర్, ఉప్పల్ జోన్లకు వినయ్‌కృషా?రెడ్డిని, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి జోన్లకు జి.సృజనను అదనపు కమిషనర్లుగా నియమించింది. ఫిబ్రవరిలో ప్రస్తుత గ్రేటర్ పాలకమండలి సభ్యుల పదవీకాలం పూర్తవనుందని, ఆ తర్వాత మూడు మహానగరపాలక సంస్థలను



ఏర్పాటు చేసి.. ఆ ఇద్దరికి అదనపు కమిషనర్లుగా కమిషనర్ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

"మూడొందల మంది అధికారుల్లోంచి.. మిమ్మల్ని ఎంపిక చేశాను. జోనల్ కమిషనర్లుగా నియమించా. నగరాన్ని అభివృద్ధి చేయండి. నా నమ్మకాన్ని నిలబెట్టుకోండి."- ఇటీవల కొత్త జెడ్సీలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్న మాటలివి.

**జెడ్సీలుగా నియమితులైన వారు వీరే..**

మల్కాజిగిరి జోన్‌కు సంచిత్ గన్వార్, ఉప్పల్‌కు రాధిక గుప్తా, ఎల్బీనగర్‌కు హేమంత్ కేశవ్ పాటిల్, రాజేంద్రనగర్‌కు అనురాగ్ జయంతి, గోల్కొండకు ముకుంద్‌రెడ్డి, ఖైరతాబాద్‌కు ప్రియాంక ఆల, శేరిలింగంపల్లికి హేమంత్ సహదేవ్‌రావు, కూకట్‌పల్లికి అపూర్వ చౌహాన్, కుతుబ్లాపూర్‌కు సందీప్‌కుమార్ ఝా జెడ్సీలుగా నియమితులయ్యారు.


# క్లిక్ చేస్తే ఉచ్చులో చిక్కినట్టే

గంగాధర : గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన శ్రీవర్ధన్ రూ.47 వేలు, బూర్గుపల్లికి చెందిన మధు రూ.57 వేలు, సర్వారెడ్డిపల్లికి చెందిన కుమార్ రూ.46,540, మంగపేటకు చెందిన భవాని రూ.70 వేలు పోగొట్టుకోగా.. కోర్టు ఆర్డర్ ద్వారా బాధితులకు రికవరీ చేసే పనులను స్థానిక పోలీసులు పూర్తి చేశారు. త్వరలోనే వీరి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.

అపరిచిత వెబ్‌సైట్లు, తెలియని వ్యక్తులు పంపే లింకుల నుంచి యాప్స్ డౌన్‌లోడ్ చేయొద్దు. కొన్నింటికి కెమెరా, గ్యాలరీ పర్మిషన్లు అవసరం ఉండదనే విషయాన్ని గమనించాలి.

ఇటీవల కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూర్గుపల్లి ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ ఏపీకే ఫైల్ ఓపెన్ చేయడంతో ఆయన రెండు బ్యాంకు ఖాతాల్లోంచి సైబర్ నేరగాళ్లు రూ.13 లక్షలు కాజేశారు.

పెద్దపల్లి జిల్లా వ్యవసాయ శాఖలో ఇద్దరు అధికారుల చరవాణులను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఓ అధికారిణి భర్త బ్యాంకు ఖాతా నుంచి రూ.10 లక్షలు మాయం చేశారు.



**మూడు నెలల్లో రూ.23 కోట్లు**

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో గత మూడు నెలల్లోనే 485 కేసులు నమోదుకాగా రూ.23,69,50,800 నగదును బాధితులు పోగొట్టుకున్నారు. వీటిలో రూ.47,92,767 రికవరీకి పోలీసులు చర్యలు చేపట్టారు. బాధితులు రూ.లక్షల్లో కోల్పోతుండగా.. రూ.వేలల్లో కోల్పోయిన కేసుల్లోనే రికవరీ జరుగుతుంది. అది కూడా చాలా రోజులు పడుతుండటంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు. అయితే రూ.లక్షల్లో మోసాలు జరిగిన సమయాల్లో ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు స్థానిక పోలీసులకు ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.

**1930ని సంప్రదిస్తే..**బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోగొట్టుకున్నట్లు చరవాణికి సందేశం వస్తే వెంటనే మొదటి గంటనే గోల్డెన్ అవర్‌గా భావించి 1930 నంబర్‌ను సంప్రదించాలి. లేదా %cybercrime.gov.in% లో లాగిన్ అయి పూర్తి వివరాలతో ఫిర్యాదునమోదు చేయాలి. ఇలా చేయడంతో తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు స్పందించి కొన్ని సెకన్లలోనే ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు రిక్వెస్ట్ పెట్టి ఖాతాను ఫ్రీజ్ చేయిస్తారు. ఇందుకుగాను ప్రతి పోలీసు స్టేషన్‌లో సంబంధిత కానిస్టేబుల్ బాధితులతో మాట్లాడి రూ.25 వేల కంటే ఎక్కువగా కోల్పోతే కేసు నమోదు చేసి బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేసిన సొమ్మును ఇప్పిస్తారు.

# బాగుంటే చప్పట్లు.. కాదంటే చివాట్లు



హైదరాబాద్: ఒకే కాలనీలో నివసించే 50 మంది గృహిణులు షాపింగ్‌లు, వంటకాల ముచ్చట్లు పంచుకునేందుకు గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. చీరలు, వంటల విషయంలో జరిగే చర్చ కాస్త పక్కదారి పట్టింది. ఒకర్నొకరు తిట్టుకోవటంతో గొడవ ముదిరింది. దీనిపై ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పంచాయితీ ఠాణాకు చేరింది. ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి సర్దుబాటు చేసేందుకు రెండ్రోజుల సమయం పట్టిందని పోలీసు అధికారి తన అనుభవాన్ని పంచుకున్నారు.

**గొడవలకు వేదికగా సామాజిక మాధ్యమాలు**

దూరాల్ని దగ్గర చేసిన సామాజిక మాధ్యమాలు రణరంగ వేదికలుగా మారుతున్నాయి. సహోద్యోగులు, మిత్రులు, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీస్‌లో ఉండే కుటుంబాలు వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. విందులు, వేడుకలు చేసుకున్నప్పుడు బాగుందంటూ చప్పట్లు కొట్టినవారే.. ఏదైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే తిట్ల దండకం అందుకుం టున్నారు. యూసుఫ్‌గూడలో ఓ అపార్ట్‌మెంట్‌వాసులు తమ వాట్సప్ గ్రూప్‌లో నిర్వహణ సరిగా లేదంటూ ఒకరు పోస్టు చేశారు. ఇది గొడవకు దారి తీసింది. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు నమోదైంది. సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేసే అంశాలను కొందరు తీవ్రంగా పరిగణిస్తుండటంతోనే గొడవలు జరుగుతున్నాయని పోలీసు అధికారి తెలిపారు.

**ఈ ప్రాంతాల్లోనే ఫిర్యాదులెక్కువ**

నార్సింగి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, బంజారాహిల్స్, సికింద్రాబాద్, అబిడ్స్‌ల్లో అధికశాతం ఈ తరహా ఫిర్యాదులు వస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

**ఏం చేయాలి?**తమకు నచ్చని అంశం పోస్ట్ చేయటం, షేర్ చేసినపుడు వారితోనే తమ అభిప్రాయం పంచుకుంటే సమస్య పరిష్కారమవుతుందని పోలీసు ఉన్నతాధికారి సూచించారు. గొడవలతో ఠాణా వరకు రావటం వల్ల విలువైన సమయంతో పాటు ఆత్మీయులను నష్టపోతారని గుర్తుంచుకోవాలన్నారు.

# ఏసీల్లేని 'ఫ్యూచర్‌సిటీ'



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్‌సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానం(డీసీఎస్) వినియోగించనున్నారు. ఏసీ లేకుండానే చల్లబర్చే డీసీఎస్‌ను కొత్తగా నిర్మించే నగరాలు, మాల్స్, టౌన్‌షిప్పుల్లో వాడుతున్నారు. తెలంగాణలో మొదటగా ఫ్యూచర్‌సిటీలో అమలుకు సర్కారు ప్రణాళికలు రూపొందించింది. ఇటీవల తెలంగాణ విజన్ 2047 పత్రంలో దీని గురించి ప్రకటించింది. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట ప్రాంతంలో 30 వేల ఎకరాల విస్తీర?ంలో భారత్ ఫ్యూచర్‌సిటీని సర్కారు ఏర్పాటు చేస్తోంది. ఇందులో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్(సీబీడీ) కీలకం. సీబీడీని పలు జోన్లుగా అభివృద్ధి చేస్తారు. 300 ఎకరాల్లో ఏఐ సిటీ, 200 ఎకరాల్లో హెల్త్‌సిటీ, 500 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతారు. 3 వేల ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ హబ్‌ను అభివృద్ధి చేస్తారు. ఇక్కడ డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానాన్ని చేపట్టనున్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్‌సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానం ఉంది. పోచారంలోని ఇన్ఫోసిస్, ఐటీ కారిడార్‌లోని ఒక గేటెట్ కమ్యూనిటీలో ఈ తరహాలోనే ఏర్పాటు చేశారు. ఇప్పుడుమరింత అధునాతమైన డీసీఎస్‌ను సిటీకి సర్కారు పరిచయం చేయబోతోంది.

**ఎలా పనిచేస్తుంది?**

ఇటీవల కాలంలో ఏసీల వినియోగం పెరగడంతో నగరాలు హీట్ ఐలాండ్స్‌గా మారుతున్నాయి. దీంతో మరింతగా ఏసీల వాడకం అవసరం అవుతోంది. ఎక్కడ చూసినా భవనాల బయట ఏసీ అవుట్‌డోర్ యూనిట్లే దర్శనమిస్తున్నాయి. ఫ్యూచర్‌సిటీలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి అవకాశం ఉండటంతో సాధారణ ఏసీల స్థానంలో చల్లని నీటిని పైపుల ద్వారా పంపి భవనాల లోపల ఉష్ణో?గ్రతలను తగ్గించే సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్ విధానం డిస్ట్రిక్ట్ కూలింగ్‌కు అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం శుద్ధి చేసిన జలాలను 5 డిగ్రీలకు శీతలీకరిస్తారు. పైపులైను ద్వారానే ప్రతి భవనం, గదికి సరఫరా చేస్తారు. భవనాల్లో ఉన్న ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లు గదులను చల్లబరుస్తాయి. ఈ క్రమంలో గదిలోని ఉషో?గ్రతకు పైపులోని నీరు వేడెక్కుతుంది. తిరిగి నీటిని శీతలీకరణ ఛాంబర్‌కు తరలించి చల్లబర్చాక మళ్లీ సరఫరా చేస్తారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ ఉంటుంది. సాధారణ ఏసీలతో పోలిస్తే 30 శాతం విద్యుత్తును ఆదా చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని ప్రభుత్వ అంటోంది.

# క్యాంపస్‌లో మత్తు .. నిఘాతో చిత్తు



హైదరాబాద్: విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లో మాదక ద్రవ్యాల పేరు వినిపించకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ అధికారులు కార్యాచరణ రూపొందించారు. యూనివర్సిటీ క్యాంపస్‌లు, వసతి గృహాల్లో మత్తుపదార్థాలు కనిపించకుండా చర్యలు చేపట్టనున్నారు. 'డ్రగ్స్ ఫ్రీ' క్యాంపస్‌లుగా మార్చేందుకు నిర?యం తీసుకున్నారు. రెండు వర్సిటీల్లో చదువుకుంటున్న కొందరు గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడటం, మరికొందరు డ్రగ్స్ విక్రయిస్తూ దొరికిపోవడం వంటి ఘటనలను పరిగణనలోకి తీసుకుని ఆ ఒరవడికి చెక్‌పెట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా నిఘా బృందాలను నియమించనున్నారు.

నిరంతరాయంగా పర్యవేక్షణక్యాంపస్‌లలో మత్తు పదార్థాల వినియోగంపై నిరంతర నిఘా ఉంచనున్నారు. వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాలను అమర్చనున్నారు. దీంతోపాటు డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై సమాచారం తెలుసుకునేందుకు వాలంటీర్లను నియమించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వాలంటీర్లుగా పనిచేయవచ్చు. వీరు విద్యార్థులతో కలిసి తిరుగుతూ రాత్రివేళల్లో క్యాంపస్‌లను వదిలేసి తరచూ బయటకు వెళ్తున్న విద్యార్థుల వివరాలను సేకరించనున్నారు. విద్యార్థులకు గంజాయి విక్రయించేందుకు ఎవరైనా ప్రయత్నించినా వెంటనే సమాచారం వచ్చేలా ప్రతి వసతిగృహంలో కొందరు వేగులను ఏర్పాటు చేసుకోనున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు కొనసాగుతున్నాయన్న సమాచారాన్ని ఈగల్ బృందాలతో పంచుకున్నారు. దీంతో కొద్దిరోజుల నుంచి అక్కడ గంజాయి సరఫరా, వినియోగం తగ్గిపోయాయి.

**అవగాహన సదస్సుల నిర్వహణ**

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను విద్యార్థులకు తెలిపేందుకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. మత్తు పదార్థాలు వినియోగించి పట్టుబడితే ఎదురయ్యే ఇబ్బందులు, జైలుకు వెళ్లే పరిస్థితులపై వివరించనున్నారు. 'మాదకద్రవ్య రహిత' క్యాంపస్‌గా మార్చేందుకు కార్యాచరణను సిద్ధం చేశామని, త్వరలో అమలు చేస్తామని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డా.కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

# బల్దియాల్లో డీజిల్ దొంగలు!

కరీంనగర్ : పుర, నగరపాలికల్లో వాహనాల వినియోగం పెరిగింది. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఇతరత్రా పనుల కోసం రూ.15 లక్షల నుంచి రూ.80 లక్షల విలువైన ఆధునిక యంత్రాలను కొనుగోలు చేశారు. వీటికి డీజిల్ వినియోగంపై నమోదులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కరీంనగర్, రామగుండం కార్పొరేషన్‌లలో ఏటా లక్షలాది రూపాయలను కేవలం ఇంధనం కోసమే వెచ్చిస్తున్నారు. రెండు వాహనాలు తిరిగిన చోట నాలుగైదు రాసి ప్రజాధనం కొల్లగొడుతున్నారు.

**జీపీఆర్ఎస్ లేక..**

పుర, నగరపాలికల్లో నడిచే ప్రతి వాహనానికి జీపీఆర్ఎస్‌ను ఏర్పాటు చేస్తే ఎక్కడికి వెళ్తుందనే సమాచారం ఇట్టే తెలుస్తుంది. దీంతోపాటు రోజులో ఎన్ని కిలోమీటర్లు నడిచిందో సమాచారం లభిస్తుంది. దీనివల్ల బిల్లుల చెల్లింపు విషయంలో ప్రామాణికత కనిపించేది. కానీ ఇలా ఏ ఒక్కచోట కూడా పారదర్శకమైన విధానాన్ని అవలంబించడం లేదు. మరోవైపు అధికారుల వాహనాలతోపాటు గతంలో ప్రజాప్రతినిధులుగా ఉన్న కౌన్సిలర్లు, కార్పొరేటర్లలో కొందరికి బల్దియా సొమ్ముతోనే డీజిల్ పోయించారనే విమర్శలున్నాయి. అసలే అరకొర నిధులతో అభివృద్ధి కుంటుపడుతున్న తరుణంలో ఇంధన సొమ్మునైనా పక్కాగా ఖర్చుచేస్తే



విలువైన ప్రజాధనం ఆదా కానుంది.

జమ్మికుంట పురపాలిక కార్యాలయంలో గత నెల 26న అనిశా అధికారులు విచారణ చేపట్టారు. చదును చేసే ట్రాక్టర్‌కు రోజుకు రూ.5 వేల డీజిల్ వినియోగించినట్లు రికార్డులో పేర్కొనడంతో అనుమానించారు. అప్పుడప్పుడు వినియోగించే ఆ ట్రాక్టర్‌కు ప్రతి రోజూ డీజిల్ ఖర్చులెందుకు రాశారని ప్రశ్నించగా సిబ్బంది నుంచి పొంతన లేని సమాధానమొచ్చింది. డీజిల్ వినియోగంలో అక్రమాలు గుర్తించినట్లు అనిశా అధికారులు ప్రకటించారు. దీంతో పాటు కార్యాలయ తనిఖీల్లో రూ.41 వేలు రసీదులకు అదనంగా ఉండటంతో వాటిని సీజ్ చేశారు.

గతంలో కరీంనగర్ కార్పొరేషన్‌లోనూ డీజిల్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా నీటి ట్యాంకర్ల ట్రాక్టర్‌ల నుంచి డీజిల్‌ను సిబ్బంది బయటకు తీస్తున్న వీడియోలు బయటకొచ్చాయి. జనరేటర్లకు ఇంధనం వినియోగించకున్నా రోజూ పోస్తున్నట్లు లెక్కలు రాశారని కొందరు సామాజిక కార్యకర్తలు సహ చట్టం వివరాలతో బహిర్గతం చేశారు. విద్యుత్తు అంతరాయం లేకున్నా డీజిల్ కోసం రూ.15-20 వేలు వెచ్చించిన తీరు, అదనంగా లీటర్ల కొద్దీ ఇంధన దుర్వినియోగంపై విమర్శలొచ్చాయి.

రామగుండం కార్పొరేషన్‌లో ప్రతి నెలా పెట్రోల్, డీజిల్ ఖర్చులో రూ.6 లక్షల వరకు అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాల విషయంలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఇంధన లెక్కలు తీశారు. జగిత్యాల పురపాలికలో గతేడాది మార్చిలోనే రూ.16 లక్షలు నకిలీ బిల్లులు రికార్డుల్లో పొందుపర్చినట్లు విమర్శలొచ్చాయి. ఏటా రూ.అర కోటికి పైగా దుర్వినియోగమవుతుండటంపై ఫిర్యాదు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

# మీ ఊరు.. మీ హక్కు

గ్రామపంచాయతీలో నిర్వహించే 'గ్రామసభ' సర్పంచి నుంచి సామాన్యుడి వరకు ఒకే వేదికపై కూర్చొని సమస్యలపై గొంతెత్తే ప్రజాస్వామ్య వేదిక. గ్రామాభివృద్ధికి నిర?యాలు, తీర్మానాలు చేసేచోటు. ఇందులో చేసే ప్రతి సంతకం, తీర్మానం ఊరి భవిష్యత్తును నిర?యించే శాసనం. గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు, ఏదైనా పని జరగాలంటే గ్రామసభ ఆమోదం తప్పనిసరి. గ్రామ పంచాయతీలో నిర్వహించే గ్రామసభకు గైర్హాజరవటం అంటే ఊరి అభివృద్ధిని ఇతరుల చేతుల్లో పెట్టడమేనని గుర్తుంచుకోవాలి.

**గ్రామసభలో సభ్యులెవరంటే?**

గ్రామసభలో గ్రామంలోని ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. పంచాయతీ కార్యదర్శి సభకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యే, మంత్రులు, కలెక్టర్ శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. సర్పంచి అధ్యక్షతన గ్రామసభలో గ్రామ అభివృద్ధిపై చర్చిస్తారు.



**ఫిర్యాదు చేయొచ్చు**

తీర్మానాల్లో అవకతవకలు జరిగాయని ఎవరైనా భావిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయొచ్చు. తీర్మానాలను సమీక్షించే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది. ఆమోదయోగ్యంగా లేనివాటిని కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో రద్దు చేస్తారు. పంచాయతీరాజ్ చట్టంప్రకారం ఏడాదికి ఆరుసార్లు గ్రామసభ నిర్వహించాలి. సర్పంచి అధ్యక్షతన గ్రామసభ కొనసాగుతుంది. సర్పంచి లేనిపక్షంలో ఉపసర్పంచి నిర్వహిస్తారు. గ్రామ సభలో చర్చించిన అంశాలు, నిర?యాలను తీర్మానాల రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. మెజారిటీ సభ్యులు ఒక పనికి అంగీకరిస్తే దాన్ని తీర్మానంగా మారుస్తారు. తీర్మాన ప్రతిని మూడు రోజుల్లోగా ఉన్నతాధికారులకు పంపిస్తేనే నిధులు మంజూరవుతాయి.

**కోరం తప్పనిసరి!**సాధారణంగా మొత్తం ఓటర్లలో పదోవంతు లేదా గ్రామ జనాభాను బట్టి నిర?యించిన సంఖ్యలో సభ్యులు హాజరుకావాలి. నిరీ?త గడువులోగా కోరం లేకపోతే సభను రెండు గంటల పాటు వాయిదా వేస్తారు. అప్పటికీ లేకపోతే ఉన్నవారితోనే గ్రామసభను కొనసాగిస్తారు. గ్రామ ఓటర్లు గ్రామసభకు హాజరుకాకపోవడంతో సర్పంచి, ఉపసర్పంచి అనుకూలమైన వారితో తీర్మానాలు చేయించుకునే ఆస్కారముంది.




భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదిరినట్లు ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. "నిన్న భారత్-ఈయూ మధ్య ఎఫ్‌టీఏ కుదిరింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా చర్చించుకుంటున్నారు" అని పేర్కొన్నారు. మంగళవారం గోవాలో ఇండియా ఎనర్జీ వీక్- 2026ను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ట్రేడ్ డీల్ గురించి మాట్లాడారు. "ఈ ఒప్పందంతో భారత్, ఐరోపా ప్రజలకు అద్భుతమైన అవకాశాలను అందిస్తుంది. ప్రపంచంలోనే పెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య సమన్వయానికి నిదర్శనం. ప్రపంచ జీడీపీలో ఇండియా, ఈయూ ఉమ్మడి వాటా 25శాతం. ప్రపంచవాణిజ్యంలో ఇది మూడోవంతుకు సమానం. ఈ డీల్ ఇరువర్గాల మధ్య వాణిజ్యాన్ని పెంపొదించడమేగాకుండా.. ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలనపై మన నిబద్ధతను బలోపేతం చేస్తుంది" అని మోదీ వెల్లడించారు. ఈ ప్రకటన అనంతరం హైదరాబాద్ హౌస్?లో మోదీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయన్ సమావేశమయ్యారు. వారు ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఇక ఈ ఎనర్జీ వీక్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాలకు చెందిన ప్రతినిధులు గోవాకు వచ్చారు. "మీరంతా ఇంధన భద్రత, సుస్థిర భవిష్యత్తు గురించి మాట్లాడేందుకు భారత్‌కు వచ్చారు. మా వద్ద భారీ రిఫైనింగ్ సామర్థ్యాలు ఉన్నాయి. ఈ విషయంలో మేం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాం. త్వరలో నంబర్‌వన్ స్థానానికి చేరుకుంటాం" అని వెల్లడించారు.




రైళ్ల ఆలస్యం కారణంగా నిత్యం ఎంతోమంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రైలు సమయానికి రాకపోవడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ అమ్మాయి తన కెరీర్‌కు కీలకమైన ప్రవేశ పరీక్షను మిస్సయ్యింది. దీనిపై ఆమె పోరాటం చేయగా.. దాదాపు ఏడేళ్ల తర్వాత ఆమెకు న్యాయం దక్కింది. రైలు ఆలస్యానికిగానూ.. సదరు విద్యార్థినికి రూ.9.10లక్షల పరిహారం లభించింది. వివరాల్లోకి వెళితే.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బస్తీ జిల్లాకు చెందిన సమృద్ధి 2018లో తన బీఎస్సీ బయోటెక్నాలజీ ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ రైలు బుక్ చేసుకుంది. బస్తీ జిల్లా నుంచి ఆ రైలు ఉదయం 11 గంటలకు లఖ్‌నవూకు చేరాల్సిఉండగా.. రెండున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. పరీక్షా కేంద్రంలో మధ్యాహ్నం 12.30 గంటల వరకే విద్యార్థులను అనుమతించడంతో సమృద్ధి ఆ పరీక్షకు హాజరయ్యే అవకాశాన్ని కోల్పోయింది. దీంతో ఆమె న్యాయ పోరాటానికి దిగింది. రైలు ఆలస్యం కారణంగా పరీక్ష రాయకపోవడంతో తాను ఏడాది కాలాన్ని నష్టపోయానంటూ జిల్లా వినియోగదారుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నష్టానికి గానూ తనకు రూ.20లక్షల పరి హారం చెల్లించాలని కోరింది. దీనిపై విచారణ జరిపిన కమిషన్ రైల్వే మంత్రిత్వశాఖకు నోటీసులు జారీ చేసింది. అయితే, రైలు ఆలస్యాన్ని ధ్రువీకరించిన మంత్రిత్వశాఖ అందుకు గల సరైన కారణాన్ని మాత్రం వెల్లడించలేకపోయింది. దాదాపు ఏడేళ్ల పాటు సాగిన ఈ విచారణలో తాజాగా కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. సదరు విద్యార్థినికి 45 రోజుల్లోగా రూ.9.10లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది.




అమరావతి: పేదరికం లేని సమాజం కోసం మన ప్రభుత్వం పని చేస్తోందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. అన్ని పదవుల్లో సామాజిక న్యాయం పాటించాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. పార్టీలో మహిళలను గౌరవించాలని సూచించారు. అమరావతిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ కమిటీల శిక్షణ తరగతులను లోకేశ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. "పార్టీపై నిబద్ధత ఉన్నవాళ్లకే పార్లమెంట్? కమిటీల్లో బాధ్యతలు అప్పగించాం. 83 శాతం మంది కొత్తవారికి చోటు కల్పించాం. చంద్రబాబు నేతృత్వంలో మనమంతా ఆయన సైనికులం. తోట చంద్రయ్య, మంజుల, అంజిరెడ్డి లాంటి ఎందరో కార్యకర్తలు మనందరికీ స్ఫూర్తి. మాట మార్చడం, మడమ తిప్పడం తెదేపా రక్తంలోనే లేదు. సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా చంద్రబాబు నడిపిస్తున్నారు. ప్రజలకు సేవ, కార్యకర్తలకు సాయం చేయాలని నిరంతరం తపించే నాయకుడు ఆయన. పార్టీలో యువతకు అవకాశాలు కల్పించాల్సిన అవసరముంది. ల తెదేపా, జనసేన, భాజపాతో కూటమి ఏర్పడింది. మూడు పార్టీల కలయిక అన్నప్పుడు చిన్నచిన్న విభేదాలు ఉంటాయి.. కాదనట్లేదు. ఇలాంటి సమస్యలను పార్లమెంట్? కమిటీల్లోని నాయకులు పరిష్కరించాలి. పార్టీల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైకాపా నేతలు ప్రయత్నిస్తారు. అందరం కలసికట్టుగా ముందుకెళ్లాలి. నియోజకవర్గాల్లో సమస్య ఉంటే పరిష్కరించాల్సిన బాధ్యత గ్రామ పార్టీ అధ్యక్షుడి నుంచి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడిపై ఉంటుంది. చంద్రబాబుపై పనిచేయడం ఛాలెంజింగ్?గా ఉంటుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పు రావాలి. ఈ వ్యవస్థను బలోపేతం చేసేందుకే మేం ఉన్నాం. కార్యకర్తలకు శిక్షణ కోసం విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలో రీజినల్ సెంటర్లను ఏర్పాటుచేస్తాం" అని లోకేశ్ వెల్లడించారు.



## సామాన్య కార్యకర్తలా కూర్చొని.. పాఠాలు విన్న సీఎం చంద్రబాబు

అమరావతి: నాలుగోసారి ముఖ్యమంత్రి అయినా.. సామాన్య కార్యకర్తలానే సీఎం చంద్రబాబు పార్టీ శిక్షణ తరగతుల్లో కూర్చొని పాఠాలు విన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పార్లమెంట్ కమిటీ వర్క్‌షాప్‌లో తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పాల్గొన్నారు. వర్క్ షాప్ జరుగుతున్న గదుల్లోకి వెళ్లిన అధినేత.. నేతల మధ్య కూర్చొని శిక్షణ తరగతులను ఫాలో అయ్యారు. నూతనంగా ఎంపికైన పార్లమెంట్ పార్టీ అధ్యక్షులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి చంద్రబాబు హాజరయ్యారు. నాయుకులు చెప్పేది శ్రద్ధగా విని.. వర్క్ షాప్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇవాళ ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న మంత్రి నారా లోకేష్.... ప్రతి గదిలోకి వెళ్లి వర్క్ షాప్?లోని అన్ని బృందాల సభ్యులతో ముచ్చటించారు. 25 పార్లమెంట్ కమిటీల నుంచి 1050 మంది కమిటీ సభ్యులు వర్క్ షాప్?నకు హాజరయ్యారు. నాలుగున్నర దశాబ్దాల పార్టీ ప్రయాణం, పార్టీ భావజాలం, క్యాడర్ మేనేజ్‌మెంట్, కార్యకర్తలు ప్రాధాన్యం వంటి అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ ప్రణాళికలు, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి వంటి అంశాలపై జరిగిన వర్క్‌షాప్‌లో సీఎం పాల్గొన్నారు.





అమరావతి, జనవరి 27: ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు జనవరి 29న మలివిడత ప్లాట్ల కేటాయింపు జరుగనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ఈ-లాటరీ విధానం ద్వారా ప్లాట్లు కేటాయించనున్నారు. నిబంధనల ప్రకారం.. పూర్తి పారదర్శకంగా ఈ-లాటరీ పద్ధతిలో ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. అయితే ముందుగా ఈ నెల 28న లాటరీ నిర్వహించాలని ప్రణాళిక ఉండగా.. దానిని 29వ తేదీకి వాయిదా వేశారు సీఆర్డీఏ అధికారులు. సీడ్ యాక్సెస్ రోడ్డు అమరావతి నగరానికి ముఖ్యమైన కనెక్టివిటీ ప్రాజెక్ట్. ఈ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇటీవల జనవరి 23న రైతులకు లాటరీ ద్వారా భూములు కేటాయించిన విషయం తెలిసిందే.
గతంలో భూ సమీకరణ ఉన్న ప్రాంతాల్లో భూములు వచ్చిన రైతుల్లో కొందరు తమకు వేరే చోట భూములివ్వాలని కోరారు. దీంతో ఈ-లాటరీ ప్రక్రియను అనుసరించడంతో పలువురు రైతులు అభ్యంతరాలు తెలిపారు. అయితే వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్న సీఆర్డీఏ అధికారులు.. ఈనెల 29న మరోసారి పూర్తిస్థాయిలో ఈ-లాటరీ ద్వారా తుది విడతలో ప్లాట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.



## దేశ రాజకీయాల్లో 'యువగళం' పాదయాత్ర పెను సంచలనం: ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు : తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గతంలో చేపట్టిన 'యువగళం' పాదయాత్ర దేశ రాజకీయాల్లో పెను సంచలనమని ఆ పార్టీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. లోకేశ్ పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నెల్లూరులో 'యువగళం- ప్రజాగళం' పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో నగరంలోని ప్రధాన మార్గాలు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అత్యాధునిక విద్య అందించేందుకు మంత్రిగా లోకేశ్? అన్నివిధాలా ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. బీద రవిచంద్ర మాట్లాడుతూ.. లోకేశ్? పాదయాత్ర ఏపీ రాజకీయాలకు గేమ్ ఛేంజర్ అని చెప్పారు. 97 నియోజకవర్గాల్లో 'యువగళం' కొనసాగిందని.. అందులో 90 చోట్ల కూటమి ఎమ్మెల్యేలు గెలుపొందారని తెదేపా నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు.

## అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు తేవాలని కోరాం: లావు శ్రీకృష్ణదేవరాయలు



దిల్లీ: ఏపీకి చెందిన వివిధ అంశాలపై పార్లమెంట్‌లో చర్చించాలని కేంద్రాన్ని కోరామని తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో నిర్వహించిన అఖిలపక్ష భేటీ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "ప్రాధాన్యం కలిగిన మూడు జాతీయ అంశాలతో పాటు రాష్ట్రానికి చెందిన అంశాలపై చర్చించాలని కోరాం. ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు, పదహారేళ్ల పిల్లలపై సోషల్? మీడియా ప్రభావంపై చర్చించాలని విజ్ఞప్తి చేశాం. ప్రధాని, ముఖ్యమంత్రి సహా కీలక నేతలు 30 రోజులపాటు జైల్లో ఉంటే పదవిని కోల్పోయే బిల్లుపైనా చర్చించాలని కోరాం. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని ఆంధ్రప్రదేశ్?కు రాజధానిగా నిర్ణయించారు. కానీ.. వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా చేసింది. ఏపీ రాజధానిగా అమరాతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఈ సమావేశాల్లోనే తీసుకురావాలని కోరాం. పూర్వోదయ పథకం కింద వీలైనన్ని ఎక్కువ నిధులు రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులకు ఇవ్వాలని.. నదుల అనుసంధానానికి సహకరించాలని విజ్ఞప్తి చేశాం. పొగాకు కొనుగోళ్ల సమస్యను పరిష్కరించాలని అఖిలపక్ష భేటీలో ప్రస్తావించాం" అని లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు.




విశాఖపట్నం: బంగ్లాదేశ్‌లోని భాగర్ హాట్ జైల్‌లో నిర్బంధంలో ఉన్న 23 మంది భారతీయ మత్స్యకారులు విడుదలయ్యారు. బంగ్లాదేశ్ డిప్యూటీ సెక్రటరీ, భారత ప్రభుత్వం తరఫున డిప్యూటీ హై కమిషన్ అధికారి శ్రీ చంద్ర జీత్ సమక్షంలో మత్స్యకారులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్?కు చెందిన ఈస్ట్ కోస్ట్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ కూడా పాల్గొన్నారు. విడుదలైన మత్స్యకారులకు మోంగ్లా పోర్టులో పోలీస్ కస్టడీలో ఉన్న వారి పడవలను అప్పగించి, అక్కడి నుంచి భారతదేశానికి పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. సముద్ర సరిహద్దులు దాటిన కారణంగా గత కొంతకాలంగా బంగ్లాదేశ్ జైలులో బందీగా ఉన్న ఈ మత్స్యకారుల విడుదల కోసం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కేంద్ర స్థాయిలో ఇప్పటికే చర్చలు జరిపారు. ఆయన చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా నేడు మత్స్యకారుల విడుదల సాధ్యమైంది.

మత్స్యకారులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన అకీరా నందన్

ఢిల్లీ, జనవరి 27: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు అకీరా నందన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి రూపొందించిన ఓ సినిమాతో తన వ్యక్తిత్వం, గోప్యతా హక్కులను ఉల్లంఘించారని తన పిటిషన్‌లో ఆరోపించాడు. ఏఐ మార్ఫింగ్ డీప్ ఫేక్ టెక్నాలజీతో రూపొందించిన ఈ సినిమాలో తన ముఖ కవళికలు, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించారని పిటిషన్?లో పేర్కొన్నాడు అకీరా. ఏఐ సినిమాతో పాటు, యూట్యూబ్, ఇన్?స్టాగ్రామ్, ఫేస్?బుక్, ఎక్స్‌లలో పెద్ద సంఖ్యలో తన పేరుతో నకిలీ ప్రొఫైల్స్, సోషల్ మీడియా పేజీలు ఉన్నాయని, వాటిని తొలగించాలని హైకోర్టును అకీరా నందన్ అభ్యర్థించాడు. అతడి పిటిషన్ స్వీకరించిన హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఏఐ సాయంతో తీసిన ఓ లవ్ స్టోరి సినిమాపై హైకోర్టు నిషేధం విధించింది. కృత్రిమ మేధస్సు, డీప్? ఫేక్ సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా అకీరా నందన్ పేరు, ఇమేజ్, పోలిక, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించడం దోపిడీ చేయడమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వక్రీకరించిన కంటెంట్‌ను రూపొందించడం అతని గోప్యతా హక్కును ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. ఈ వీడియోకు సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలు తొలగించాలని, ఐపి వివరాలను బహిర్గతం చేయాలని మెటా, యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్ , ఎక్స్ సంస్థలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణ జస్టిస్ తుషార్ రావు ధర్మాసనం ముందు జరిగింది. అకీరా నందన్ తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. గూగుల్ తరఫున ఆదిత్యా గుప్తా, మెటా తరఫున వరుణ్ పాఠక్ న్యాయవాదులు కోర్టులో హాజరయ్యారు.

## పొట్టి నిక్కర్లో హీట్ పుట్టిస్తున్న సోనాల్!

సాధారణంగా హీరోయిన్స్ ఇండస్ట్రీలోకి రావాలనే కోరికతో భాగంగా మోడల్ గా కెరీయర్ మొదలుపెట్టి.. ఆ తర్వాత హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు. అయితే ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంటున్నారా అంటే చెప్పలేని పరిస్థితి. కొంతమంది దశాబ్దాల తరబడి ఇండస్ట్రీలోనే కొనసాగితే.. మరికొంతమంది ఒకటి రెండు చిత్రాలకే దూరమవుతున్నారు. ఇంకొంతమంది తెలుగులో సినిమాలు చేసి ఇక్కడ మళ్ళీ అవకాశాలు లభించక.. పక్క భాష ఇండస్ట్రీలో అవకాశాలు అందుకుంటున్న విషయం తెలిసిందే. ఇక అలా అవకాశాలు వెతుక్కునే పనిలో మరోవైపు సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను పెంచుకొని దర్శకనిర్మాతల దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ తమ అందంతో గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ సెలబ్రిటీస్ వారు షేర్ చేసే ఫోటోలు అభిమానులను మరింత ఖుషి చేస్తున్నాయని చెప్పాలి. కొంతమంది అందాలు ఆరబోస్తుంటే మరి కొంతమంది చీర కట్టులో సాంప్రదాయంగా కనిపించి అభిమానులకు దగ్గరవుతున్నారు. అలాంటి వారిలో సోనాల్ చౌహాన్ కూడా ఒకరు. తాజాగా ఇన్స్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫోటోలు పంచుకున్న ఈ ముద్దుగుమ్మ.. పొట్టి నిక్కర్లో తన అందాలతో అభిమానులను ఆకట్టుకుంది. వైట్ టాప్ , డెనిమ్ షాట్



లో అందాలు ఆరబోసిన ఈ ముద్దుగుమ్మ భిన్నమైన ఫోజులతో ఫోటోలకు ఫోజులిచ్చింది. ఇక అమ్మడి అందానికి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. ఇక సోనాల్ చౌహాన్ విషయానికి వస్తే.. మలేషియాలోని సారవాక్ రాష్ట్రంలోని మిరిలో 2005లో మిస్ వరల్డ్ టూరిజం కిరీటాన్ని సొంతం చేసుకుంది . ఈ కిరీటాన్ని అందుకున్న తొలి భారతీయురాలు కూడా ఈమె కావడం గమనార్హం. ఆ తర్వాత ప్రముఖ కవర్ పేజీలపై కూడా సందడి చేసింది ఈ ముద్దుగుమ్మ. ఇక తొలిసారి హిమేష్ రేషమ్మియా తీసిన ఆప్ కా సురూర్ అనే చిత్రం ద్వారా వెండితెరకు తొలిసారి పరిచయమైంది. ఇందులో ఇమ్రాన్ హష్మీ సరసన నటించిన ఈమె తొలిసారి తెలుగులో 2008లో ఇంద్రధనస్సు అనే సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమా సమయంలో ఈమెకు పెద్దగా గుర్తింపు రాలేదు కానీ నటసింహ బాలకృష్ణ హీరోగా నటించిన లెజెండ్ సినిమా ద్వారా ఈమెకు మరింత పాపులారిటీ లభించింది. ఈ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు లభించాయి. అలా పండగ చేస్కో, షేర్ , సైజ్ జీరో వంటి తెలుగు చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే తెలుగులోనే కాదు తమిళ్ వంటి భాషా చిత్రాలలో కూడా నటించింది సోనాల్ చౌహాన్. ఇకపోతే ఒకవైపు తెలుగులో మరొకవైపు హిందీలో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె 2023లో ప్రభాస్ హీరోగా నటించిన ఆది పురుష్ సినిమాలో మండోదరి పాత్రలో నటించి ఆకట్టుకుంది. ప్రస్తుతం హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె అటు టెలివిజన్ సిరీస్లో కూడా నటిస్తోంది. ఇక ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటే ఇలా గ్లామర్ ఫోటోలు పంచుకుంటోంది.

## కియారాకు కొత్త తలనొప్పి.. పాతవి తవ్వి తీసి దారుణంగా!

కియారా అద్వానీకి సంబంధించిన ఒక పాత వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్ళీ వైరల్ అవుతోంది. అయితే ఈ వీడియోలో బీఫ్ (గోమాంసం), పోర్క్ నిషేధంపై చేసిన వ్యాఖ్యల కారణంగా నెటిజన్లు తనను దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. నిజానికి ఈ వీడియో ఇప్పటిది కాదు.. కొన్ని సంవత్సరాల క్రితం ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నప్పటిది. అప్పట్లో ప్రభుత్వం విధించిన కొన్ని నిషేధాల గురించి స్పందిస్తూ చేసిన కామెంట్స్ ఇప్పుడు విమర్శలకు దారితీశాయి. ఆ ఇంటర్వ్యూలో కియారా మాట్లాడుతూ.. --దేశంలో పోర్క్, బీఫ్ నిషేధించడం వల్ల చాలా మందికి ఇబ్బంది కలుగుతోంది. ప్రజలు ఏం చూడాలి.. ఏం తినాలి అనేది వారి వ్యక్తిగత ఇష్టం. ఇలాంటి వాటిపై నిషేధం విధించడం కంటే దేశంలో ఉన్న ఇతర



ముఖ్యమైన సమస్యలపై దృష్టి పెట్టాలి-- అనే అర్థం వచ్చేలా మాట్లాడారు. ఈ వీడియో బయటకు రావడంతో చాలా మంది కియ?రాపై తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. మతపరమైన మనోభావాలను గౌరవించకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు! అని కొందరు.. అసలు ఇలాంటి విషయాల గురించి మాట్లాడాల్సిన అవసరం ఏముంది అని మరికొందరు కామెంట్ చేస్తున్నారు.

**ఎందుకు ఇప్పుడు వైరల్ అవుతోంది?....** సాధారణంగా సెలబ్రిటీల పాత వీడియోలను ఎవరో ఒకరు తవ్వి తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు. ఇవన్నీ యూత్ లో వైరల్ అవుతూనే ఉంటాయి. ప్రస్తుతం బాలీవుడ్ సినిమాలపైనా, నటీనటుల వ్యక్తిగత అభిప్రాయాలపైనా సోషల్ మీడియాలో చర్చలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఈ వీడియో వైరల్ గా మారింది. ఇవన్నీ గతంలో చేసిన వ్యాఖ్యలే అయినా కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో అవి వివాదాస్పదంగా మారాయి. మ?నోభావాలు దెబ్బ తినే కాలంలో ఇలాంటి వీడియోలను ప్రత్యేకంగా విశ్వేషిస్తోంది ఈ ప్ర?పంచం. కియారా అద్వానీ ప్రస్తుతం తన అప్కమింగ్ ప్రాజెక్టలతో బిజీగా ఉన్నారు. త?న?పై వ?స్తున్న విమర్శల విషయంలో కియారా వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి కొత్త వివరణ రాలేదు. కియ?రా అద్వాణీ- సిద్ధార్థ్ మల్హోత్రా జంట?కు పండంటి ఆడ బిడ్డ (సరయూ) జన్మించిన సంగతి తెలిసిందే. ఆ త?ర్వాతా సినిమాల పరంగా కియరా జోరు తగ్గలేదు. గేమ్ ఛేంజర్, వార్ 2 తరవాతా కియరా లైనప్ అసాధారణంగా ఉంది. ప్రస్తుతం యష్ సరసన పాన్ ఇండియన్ చిత్రం టాక్సిక్ లో నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ యష్ హీరోగా వస్తున్న ఈ పీరియడ్ గ్యాంగ్స్టర్ సినిమాలో కియారా (నాడియా) పాత్ర యూనిక్ గా ఉంటుందని సమాచారం. మార్చి 19న ఉగాది సందర్భంగా ఈ చిత్రం విడుదల కానుంది.





## ప్రభాస్, బన్నీ అలా.. చరణ్, తారక్ ఇలా!



టాలీవుడ్ పాన్ ఇండియా స్టార్ల మధ్య ఆసక్తికర పోలికలు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. ప్రభాస్, అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోలు వరుసగా భారీ సినిమాలు లైన్లో పెట్టుకుని ఫుల్ స్పీడ్లో దూసుకుపోతుంటే.. రామ్ చరణ్, ఎన్టీఆర్ మాత్రం తదుపరి ప్రాజెక్టుల విషయంలో కొంత నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. బాహుబలి తర్వాత ఓ రేంజ్ లో ఇమేజ్ తెచ్చుకున్న ప్రభాస్ ప్రస్తుతం పాన్ ఇండియా రేసులో ముందంజలో ఉన్నారు. ఆయన చేతిలో ఒకేసారి నాలుగు భారీ సినిమాలు ఉన్నాయి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన కల్కి 2898 ఏడీకి సీక్వెల్ గా కల్కి 2 ప్లానింగ్ లో ఉంది. ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన సలార్ కు కొనసాగింపుగా సలార్ 2 కూడా రెడీ అవుతోంది. ఇక హను రాఘవపూడితో ఫౌజీ చిత్రాన్ని ప్రభాస్ చేస్తున్నారు. అంతేకాదు, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో భారీ యాక్షన్ మూవీ స్పిరిట్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కమర్షియల్, యాక్షన్, పీరియాడిక్, సైకాలజికల్ థ్రిల్లర్.. ఇలా విభిన్న జానర్లలో సినిమాలు ఎంచుకుంటూ ప్రభాస్ తన పాన్ ఇండియా మార్కెట్ ను మరింత స్ట్రాంగ్ మార్చుకుంటున్నారు. అదే సమయంలో పుష్ప సినిమాతో నేషనల్ ఐకాన్ గా మారిన అల్లు అర్జున్ ప్రాజెక్టుల విషయంలో తగ్గేదేలే అంటూ ముందుకెళ్తున్నారు. ప్రస్తుతం అట్లీతో మూవీ చేస్తున్న ఆయన.. ఆ తర్వాత లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో భారీ యాక్షన్ మూవీ చేయనున్నారు. అలాగే సందీప్ రెడ్డి వంగాతో మరో పాన్ ఇండియా ప్రాజెక్ట్ కూడా ప్లాన్ లో ఉంది. ఇవే కాకుండా మరో రెండు పెద్ద సినిమాలపై చర్చలు సాగుతున్నాయి. వరుసగా మూడు నుంచి నాలుగు ప్రాజెక్టులు లైన్లో పెట్టుకుని అల్లు అర్జున్ కూడా పాన్ ఇండియా రేసులో ప్రభాస్ తో సమానంగా పోటీ పడుతున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక రామ్ చరణ్, ఎన్టీఆర్ విషయానికి వస్తే, ఇద్దరి లైనప్ లో ప్రస్తుతం ఒక్కో సినిమా మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. బుచ్చిబాబు దర్శకత్వంలో ఇప్పుడు పెద్ది సినిమా చేస్తున్న చరణ్.. ఆ తర్వాత సుకుమార్ తో వర్క్ చేయనున్నారు. ఆ మూవీ కన్ఫర్మ్ అయినప్పటికీ.. ఇప్పటివరకు అధికారిక ప్రకటన లేదు. అలాగే ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ తో వర్క్ చేస్తున్నారు. దీని తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఆ ప్రాజెక్ట్ కూడా నుంచి ఓకే వచ్చినప్పటికీ అధికారిక అనౌన్స్మెంట్ మాత్రం ఇంకా రాలేదు. దేవర 2 ఉన్నా కూడా అది డౌటే. అయితే పాన్ ఇండియా స్టార్ గా నిలదొక్కుకోవాలంటే ఎప్పుడూ కనీసం మూడు సినిమాలు లైన్లో ఉండటం చాలా ముఖ్యమని సినీ విశ్లేషకులు అంటున్నారు. ప్రభాస్, అల్లు అర్జున్ వరుస సినిమాలతో మార్కెట్ ను కంటిన్యూ చేస్తుండగా.. చరణ్, ఎన్టీఆర్ కాస్త వెనకబడ్డారని అంటున్నారు. కానీ త్వరలోనే చరణ్, సుకుమార్, ఎన్టీఆర్- త్రివిక్రమ్ సినిమాలపై అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది.

## క్రేజీ కాన్సెప్ట్ తో నితిన్ 36




టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ ఇప్పుడు రూట్ మారుస్తున్నారు. కమర్షియల్ ఎంటర్టైనర్స్, లవ్ స్టోరీస్ తో అలరించిన నితిన్.. ఈసారి ఒక క్రేజీ సైన్స్ ఫిక్షన్ డ్రామాతో ఆడియన్స్ ను సర్ ప్రైజ్ చేయడానికి రెడీ అవుతున్నారు. వెరైటీ కాన్సెప్టులతో సినిమాలు తీసే దర్శకుడు విఐ.ఆనంద్ ఈ ప్రాజెక్టును హ్యాండిల్ చేస్తుండటంతో పాజిటివ్ హైప్ క్రియేట్ అవుతోంది. రథ సప్తమి సందర్భంగా ఆదివారం ఈ సినిమాను అఫీషియల్?గా అనౌన్స్ చేశారు. నితిన్ కెరీర్లో ఇది 36వ సినిమా. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఊరు పేరు భైరవకోన' వంటి వైవిధ్యమైన సినిమాలతో తనకంటూ ఒక స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు విఐ.ఆనంద్. ఇప్పుడు నితిన్ కోసం ఒక హై కాన్సెప్ట్ సైఫై కథను సిద్ధం చేశారు. ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని ఒక కొత్త సినిమాటిక్ ఎక్స్పీరియెన్స్?ను ఈ సినిమా ద్వారా అందించబోతున్నట్లు మేకర్స్ ప్రామిస్ చేస్తున్నారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్పై శ్రీనివాస చిట్టూరి ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక రిలీజ్ చేసిన పోస్టర్?పై ఉన్న "NO BODY NO RULES" డిఫరెంట్ గా ఉంది. నితిన్ ముఖం నుంచి వస్తున్న పొగ, అందులో కనిపిస్తున్న సిటీ విజువల్స్ చూస్తుంటే దర్శకుడు విఐ.ఆనంద్ ఒక విజువల్ వండర్?ను ప్లాన్ చేసినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా నితిన్ క్యారెక్టర్ చాలా రఫ్ అండ్ టఫ్ గా ఉండబోతోందని ఈ పోస్టర్ హింట్ ఇస్తోంది. ప్రస్తుతం నితిన్ సాలిడ్ హిట్ కోసం వెయిట్ చేస్తున్నారు. ఇలాంటి టైమ్ లో ఒక రెగ్యులర్ మాస్ సినిమా కాకుండా.. ఇలాంటి ప్రయోగాత్మక చిత్రం వైపు మొగ్గు చూపడం విశేషం. ఆనంద్ సినిమాల్లో ఉండే విజువల్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ నితిన్ ఎనర్జీకి తోడైతే బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ రిపీట్ అయ్యే ఛాన్స్ ఉంది. ఈ క్రేజీ కాంబో ఇండస్ట్రీ వర్గాల్లో కూడా ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాలో నితిన్ లుక్ చాలా డిఫరెంట్ గా ఉండబోతోందని టాక్. సైన్స్ ఫిక్షన్ జోనర్ కాబట్టి గ్రాఫిక్స్ కు కూడా ఎక్కువ ఇంపార్టెన్స్ ఉంటుందని తెలుస్తోంది. పవన్ కుమార్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలోనే పట్టాలెక్కనుంది. నితిన్ కెరీర్ లోనే ఇది ఒక ఛాలెంజింగ్ రోల్ అని చెప్పొచ్చు. నేటి జనరేషన్ ఆడియన్స్ ఎప్పుడూ కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. అందుకే రొటీన్ కథలకు భిన్నంగా వి.ఐ.ఆనంద్ ఈ సబ్జెక్టును పక్కాగా ప్లాన్ చేశారట. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ సంస్థ గ్రాండ్ స్కేల్ లో ఈ సినిమాను నిర్మించడానికి సిద్ధమైంది. ఇక ఈ సైఫై ఎంటర్టైనర్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

## ట్రెండీ దుస్తుల్లో మెస్మరైజ్ చేస్తున్న దిశా పటానీ!

ఇటీవల కాలంలో హీరోయిన్స్ తమ ఉనికిని చాటుకోవడానికి సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారు. అందులో భాగంగానే కొంతమంది గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేయగా.. మరి కొంతమంది సాంప్రదాయంగా కనిపించి అభిమానులను మెస్మరైజ్ చేస్తున్నారు. మరికొంతమంది అందాలను ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇకపోతే తమ అందాలతో ఆకట్టుకోవడమే కాకుండా మ్యాగజైన్ కవర్ పేజీలపై కూడా దర్శనమిచ్చి అటు గ్లోబల్ స్థాయిలో క్రేజ్ సొంతం చేసుకుంటున్నారు. అలాంటి వారి జాబితాలోకి ఇప్పుడు దిశాపటానీ కూడా చేరిపోయింది. ముఖ్యంగా తన అందంతో ఆడియన్స్ ను ఆకట్టుకునే ఈ చిన్నది తాజాగా కవర్ పేజీ పై మెరిసి తన ట్రెండీ దుస్తులతో మరోసారి వార్తల్లో నిలిచింది. మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ఇచ్చిన ఫోటోలను ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేయగా.. అవి అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇందులో సింపుల్ లుక్ లో చాలా ట్రెండీగా కనిపిస్తూ తన అవుట్ ఫిట్ తో ఫ్యాషన్ ఐకాన్ గా మారింది. ప్రస్తుతం కవ్వించే కళ్ళతో మత్తెక్కించేలా మాయ చేస్తూ.. తన ట్రెండీ ఔట్ఫిట్ తో అభిమానులను మెస్మరైజ్ చేస్తోంది. వైట్ అండ్ గ్రీన్ కాంబినేషన్లో ఉన్న ఈ ఫ్రాక్ అభిమానులను ఆకట్టుకుంటుంది. మరో ఫోటోలో రెడ్ డ్రెస్ లో అందాలు ఆరబోస్తూ రెచ్చగొట్టింది. ఇంకొక వైపు బ్లాక్



డ్రెస్సులో మెప్పించింది. అలా భిన్నమైన రకరకాల ట్రెండీ అవుట్ ఫిట్స్ తో అందరినీ ఆకట్టుకుంది దిశా పటాని. మొత్తానికైతే దిశా పటానీ పంచుకున్న ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా ఫాలోవర్స్ ఈమె అందానికి ముగ్ధులు అవుతున్నారు. అంతేకాదు తమ మనసులోని భావాలను కవిత్వాల రూపంలో వ్యక్తపరుస్తూ కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ గా పేరు దక్కించుకున్న పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన లోఫర్ సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత హిందీలో ఎంఎస్ ధోని ది అన్ టోల్డ్ స్టోరీ సినిమాలో నటించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమా తర్వాత బాలీవుడ్ కే పరిమితమైంది దిశా పటాని. అక్కడే ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె పలు మ్యూజిక్ వీడియోలలో కూడా కనిపించి సందడి చేసింది. ఇకపోతే తన అద్భుతమైన నటనతో అవార్డులు కూడా అందుకుంది దిశాపటాని. 2017లో ఈమె నటించిన ఎంఎస్ ధోని ది అన్ టోల్డ్ స్టోరీ సినిమాకి గానూ .. బిగ్ స్టార్ ఎంటర్టైన్మెంట్ అవార్డ్స్ లో భాగంగా మోస్ట్ ఎంటర్టైన్మెంట్ యాక్టర్ అరంగేట్రం విభాగంలో అవార్డు అందుకుంది. అలాగే ఉత్తమ మహిళా అరంగేట్రం విభాగంలో స్టార్ స్క్రీన్ అవార్డు, స్టార్ డస్ట్ అవార్డు, ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిలిమ్స్ అకాడమీ అవార్డులను కూడా అందుకుంది. ఇక 2018లో ఈమె నటించిన భాగీ 2 చిత్రానికి గానూ లక్స్ గోల్డెన్ రోజ్ అవార్డు దక్కించుకుంది.

## తాప్సీ 'బేబి' లో దాగి ఉన్న అసలు నిజం

తాప్సీ పన్ను నోట -బేబి- అనే మాట వినిపించింది. అయితే -బేబి- అని ప్రేమగా అనగానే, పెళ్లి తర్వాత శుభవార్త చెబుతోంది! అంటూ కొందరు నెటిజనులు గుసగుసలాడారు. అయితే అసలు ఈ పిలువు వెనక అసలు సంగతి ఏమిటి అంటే.. దీనికి సమాధానం వేరుగా ఉంది. నిజానికి తాప్సీ పన్నుకు బిడ్డ పుట్టలేదు. తన సోషల్ మీడియా పోస్టులో -బేబి- అని మాత్రమే ప్రస్తావించింది ఇదంతా తనకు పుట్టబోయే బేబి గురించి కాదు.. తన సినిమా గురించి. తాప్సీ ప్రధాన పాత్రలో నటించిన -బేబీ- సినిమా విడుదలై 11 ఏళ్లు పూర్తయింది. అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నీరజ్ పాండే దర్శకత్వంలో రూపొందించిన స్పై థ్రిల్లర్ బేబి (2015) విడుదలై 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తాప్సీ ఒక పోస్ట్ చేశారు. తాప్సీ తన నోట్ లో ఇలా రాసింది. --11 ఏళ్లు అయింది.. అప్పట్లో స్పై సినిమాలు (గూఢచారి చిత్రాలు) ప్రతి శుక్రవారం వచ్చే ట్రెండ్ కాదు. ఈ సినిమాలో చిన్న పాత్ర పోషించినందుకు గర్వంగా ఉంది!-- అని తాప్సీ రాశారు. ఇటీవల థియేటర్లలో విడుదలైన -ధురంధర్-




స్పై సినిమా భారీ వసూళ్లను సాధించింది. --ప్రతి శుక్రవారం వచ్చే ట్రెండ్ కాదు-- అని వ్యాఖ్యానించడం వెనక -ధురంధర్- విజయాన్ని ఉద్దేశించి పరోక్షంగా విమర్శించడమేనని .. ఆ సినిమా సక్సెస్ను చూసి తాప్సీ అసూయ పడుతోందని నెటిజనులు ట్రోల్ చేస్తున్నారు. అయితే ఇటీవల వస్తున్న స్పై సినిమాలన్నిటినీ ఒకే గాటన కట్టేసి తాప్సీ చేసిన కామెంట్ కి చాలా మంది ఫీలయ్యారు. అలా హర్టయిన వారంతా తాప్సీపై విరుచుకుపడుతున్నారు. ఇది కేవలం రణవీర్ సింగ్ దురంధర్ సినిమా గురించే కాదు. సల్మాన్ నటిస్తున్న స్పై థ్రిల్లర్ల గురించి కూడా. వాస్తవానికి తాప్సీ పన్ను అనురాగ్ కశ్యప్ శిష్యురాలు. తన గురువు ఇటీవల బాలీవుడ్ రాజకీయాలను తట్టుకోలేక సౌత్ కి వెళ్లిపోయాడు. ఇప్పుడు తాప్సీ కూడా తన సినిమాలకు తానే నిర్మాతగా మారింది. తనకు తానుగానే మనుగడ సాగించాల్సిన స్థితి కనిపిస్తోంది. అందుకే తన ముందు ఉన్న పరిస్థితుల గరించి ఓపెన్ గా తాప్సీ ఇలా మాట్లాడుతోంది. తనలోని అసహనాన్ని కూడా ఏదో ఒక విధంగా బయటపెడుతోంది. తాప్సీ ప్రస్తుతం -అస్సి- అనే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్లో నటిస్తున్నారు. దీని మోషన్ పోస్టర్ ఈనెలలోనే విడుదలైంది. అన్నట్టు అక్షయ్ కుమార్ బేబి సీక్వెల్ ని తెరకెక్కిస్తే , ఆ సీక్వెల్ లో నటించేందుకు తాప్సీ సిద్ధంగా ఉందా?




వరంగల్ : మేడారం మహాజాతరకు సర్వం సిద్ధమైంది. బుధవారం నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర ఘనంగా జరగనుంది. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం 8 జోన్లు, 42 సెక్టర్లుగా జాతరను విభజించి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 21 శాఖలకు చెందిన 42,027 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బంది మేడారంలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా జాతరలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు ఏఐ సహకారంతో అత్యాధునిక డ్రోన్లు, సీసీ కెమెరాలతో సన్నద్ధం అవుతున్నారు. అలాగే 20 లక్షల మంది భక్తులను సురక్షితంగా జాతరకు చేర్చేందుకు ఆర్టీసీ కార్యాచరణ రూపొందించింది. భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖతో పాటు నీటిపారుదలశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖలన్నీ కూడా సిద్ధమయ్యాయి. భక్తులకు సెల్ సిగ్నల్స్ సమస్య ఉత్పన్నం కాకుండా భారీగా మొబైల్స్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. మేడారం జాతరలో అత్యంత కీలకమైనది పోలీస్ శాఖనే. ట్రాఫిక్‌తో పాటు శాంతిభద్రతల భారం ఆ శాఖపైనే ఉండటంతో పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నారు. జాతరలో 13వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్పీలు, ఏసీపీలు, డీసీపీలు, డీఎస్పీలు కూడా విధుల్లో చేరుతున్నారు. గత జాతరలో సుమారు 30వేల మంది భక్తులు తప్పి పోయిన నేపథ్యంలో ఈసారి జియోట్యాగ్ బెస్ట్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకవచ్చారు. వృద్ధులు, పిల్లలకు పస్రా, తాడ్వాయి మార్గాల్లో క్యూఆర్ కోడ్ గల జియోట్యాగ్‌ను కడుతారు. దీంతో ఎవరైనా తప్పిపోయినా ఈ ట్యాగ్ ను స్కాన్ చేస్తే వివరాలు తెలిసిపోతాయి. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ప్రస్తుతం మేడారంలో అమలు చేస్తున్నారు. అలాగే శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని 12క్రైమ్ బృందాలను ఏర్పాటు చేశారు.




పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకొంటున్నాయి. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ తాజాగా పశ్చిమాసియాకు చేరుకుంది. దీంతో ఇరాన్‌పై యూఎస్ ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. అబ్రహం లింకన్‌తో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇక్కడికి చేరుకున్నాయి. అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ప్రాంతీయ భద్రత, స్థిరత్వం కోసం దీన్ని మోహరించినట్లు పేర్కొంది. ఈ బృందం ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో కాకుండా.. హిందూ మహాసముద్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ పరిణామాలతో ఈ ప్రాంతంలో అమెరికా సైనిక సిబ్బంది సంఖ్య మరింత పెరిగింది.

**ఎర్రసముద్రానికి వస్తే మంటలే...** ఇదిలాఉండగా.. పెంటగాన్ పలు ఫైటర్ జెట్‌లు, మిలిటరీ కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తరలించనున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన ఘర్షణల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఆందోళనకారులకు మద్దతుగా నిలిచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. వారికి వ్యతిరేకంగా ఇరాన్ ప్రభుత్వం ఏదైనా చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో భారీగా తమ సైన్యాన్ని ఇరాన్? దిశగా పంపినట్లు ప్రకటించారు. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

**అమెరికా చర్చలకు సిద్ధం..!...** ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ చర్చించాలనుకుంటే అమెరికా అందుకు సిద్ధంగా ఉందని అగ్రరాజ్యానికి చెందిన అధికారి ఒకరు పేర్కొన్నారు. చర్చలు ముందుకుసాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో టెహ్రాన్‌కు ఇప్పటికే తెలుసని అన్నారు.




హైదరాబాద్ : తెలంగాణలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలకు ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్ఈసీ రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

**మున్సిపల్ ఎన్నికల ముఖ్య తేదీలు...** జనవరి 28 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం. జనవరి 30తో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ గడువు. జనవరి 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. ఫిబ్రవరి 11న పోలిం గ్. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న 53 లక్షల మందికి పైగా ఓటర్లు.




మట్టెవాడ: వరంగల్?లో విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న వైద్యురాలు మృతిచెందారు. మట్టెవాడ ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా చించోలి మండలం బత్తంపల్లికి చెందిన ఎస్.మ మతారాణి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. నగరంలోని హంటర్‌రోడ్డులోని ఫాదర్ కొలంబో ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాది నారాయణపేట జిల్లాకు చెందిన డాక్టర్ రాఘవేంద్రతో ఆమెకు వివాహం జరిగింది.

సోమవారం రాత్రి విధులు ముగించుకొని భర్తతో కలిసి హంటర్ రోడ్డు మీదుగా బైక్?పై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో ఏడు మోరీల కూడలి వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన టిప్పర్ వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు కింద పడిపోయారు. 9 నెలల గర్భిణిగా ఉన్న మమతా రాణి తీవ్రంగా గాయపడటంతో స్థానికుల సహాయంతో భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు. టిప్పర్ డ్రైవర్ అన్సారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లోని 7 కార్పొరేషన్లు, 414 డివిజన్లు, 116 మున్సిపాల్టీలు 2,582 వార్డుల్లో ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఎన్నికలు జరగనున్న కార్పొరేషన్లు, మున్సిపాల్టీల వివరాలివే..

**మున్సిపల్ కార్పొరేషన్లు - వార్డుల సంఖ్య...** కరీంనగర్ (66) రామగుండం (60) నిజామాబాద్ (60) మహబూబ్‌నగర్ (60) మంచిర్యాల (60) భద్రాద్రి కొత్తగూడెం (60) నల్గొండ (48)

మున్సిపాలిటీలు-116 (వార్డులు-2582)

**జనగామ..** జనగామ (30) స్టేషన్ ఘన్‌పూర్ (18)

**వరంగల్..** నర్సంపేట (30) వర్ధన్నపేట (12)

**హనుమకొండ..** పరకాల (22)

**మహబూబాబాద్..** డోర్నకల్ (15) కేసముద్రం (16) మహబూబాబాద్ (36) మరిపెడ (15) తొర్రూర్ (16)

**జయశంకర్ భూపాలపల్లి...** భూపాలపల్లి (30)

**కరీంనగర్...** చొప్పదండి (14) హుజూరాబాద్ (30) జమ్మికుంట (30)

**జగిత్యాల...** ధర్మపురి (15) జగిత్యాల (50) కోరుట్ల (33) మెట్‌పల్లి (26) రాయికల్ (12)

**రాజన్న సిరిసిల్ల...** సిరిసిల్ల (39) వేములవాడ (28)

**పెద్దపల్లి...** మంథని (13) పెద్దపల్లి (36) సుల్తానాబాద్ (15)

**ఖమ్మం...** ఏదులాపురం (32) కల్లూరు (20) మధిర (22) సత్తుపల్లి (23) వైరా (20)

**భద్రాద్రి కొత్తగూడెం...** అశ్వారావుపేట (22) ఇల్లెందు (24)

**ఆదిలాబాద్...** ఆదిలాబాద్ (49)

**నిర్మల్...** భైంసా (26) ఖానాపూర్ (12) నిర్మల్ (42)

**కుమురం భీం ఆసిఫాబాద్...** ఆసిఫాబాద్ (20) కాగజ్ నగర్ (30)

**మంచిర్యాల...** బెల్లంపల్లి (34) చెన్నూరు (18) క్యాతనపల్లి (22) లక్సెట్టిపేట (15)

**రంగారెడ్డి...** ఆమనగల్ (15) చేవెళ్ల (18) ఇబ్రహీంపట్నం (24) మొయినాబాద్ (26) షాద్‌నగర్ (28) శంకర్‌పల్లి (15)

**వికారాబాద్...** కొడంగల్ (12) పరిగి (18) తాండూర్ (36) వికారాబాద్ (34)

**మేడ్చల్ - మల్కాజిగిరి...** అలియాబాద్ (20) మూడుచింతలపల్లి (24) ఎల్లంపేట (24)

**నిజామాబాద్...** ఆర్మూరు (36) భీమ్‌గల్ (12) బోధన్ (38)

**కామారెడ్డి...** బాన్సువాడ (19) బిచ్కుంద (12) కామారెడ్డి (49) ఎల్లారెడ్డి (12)

**యాదాద్రి భువనగిరి...** ఆలేరు (12) భువనగిరి (35) చౌటుప్పల్ (20) మోత్కూరు (12) పోచంపల్లి (13) యాదగిరిగుట్ట (12)

**సూర్యాపేట..** హుజూర్‌నగర్ (28) కోదాడ (35) నేరేడుచర్ల (15) సూర్యాపేట (48) తిరుమలగిరి (15)

**నల్గొండ...** చండూర్ (10) చిట్యాల (12) దేవరకొండ (20) హాలియా (12) మిర్యాలగూడ (48) నల్గొండ (12)

**సిద్దిపేట...** చేర్యాల (12) దుబ్బాక (20) గజ్వేల్ (20) హుస్నాబాద్ (20)

**సంగారెడ్డి...** అందోలు - జోగిపేట (20) గడ్డపోతారం (18) గుమ్మడిదల (22) ఇంద్రేశం (18) ఇస్నాపూర్ (26) జిన్నారం (20) కోహిర్ (16) నారాయణ్‌ఖేడ్ (15) సదాశివపేట్ (26) సంగారెడ్డి (38) జహీరాబాద్ (37)

**మెదక్...** మెదక్ (32) నర్సాపూర్ (15) రామాయంపేట (12) తూప్రాన్ (16)

**మహబూబ్ నగర్...** భూత్పూర్ (10) దేవరకద్ర (12)

**నారాయణపేట...** కోస్గి (16) మద్దూరు (16) మక్తల్ (16) నారాయణపేట (24)

**జోగులాంబ గద్వాల్...** అలంపూర్ (10) గద్వాల్ (37) అయిజ (20) వడ్డేపల్లి (10)

**వనపర్తి...** అమరచింత (10) ఆత్మకూరు (10) కొత్తకోట (15) పెబ్బేరు (12) వనపర్తి (33)

**నాగర్‌కర్నూలు...** కల్వకుర్తి (22) కొల్లాపూర్ (19) నాగర్‌కర్నూలు (24)

**ములుగు...** ములుగు (20)




హైదరాబాద్ : ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసింది మాజీ ఎంపీ సంతోష్ రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. గద్దర్ లాంటి నాయకులు గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే దానికి కారణం ఆయనేనని ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్సైజ్? పోలీసులంటే గంజాయి సరఫరాదారులు, స్మగ్లర్లకు భయం లేదని కవిత అన్నారు. ఎక్సైజ్ పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉంటేనే భయం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో గృహ హింస పెరిగిపోతోందన్నారు. "సీఎం రేవంత్ రెడ్డికి సంతోష్‌రావు గూఢచారి. నేను ముందునుంచి చెబుతున్న దెయ్యం ఆయనే. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంతోష్‌కు ఎలాంటి శిక్ష విధిస్తుందనేది వేచి చూడాలి. ఆయనకు శిక్ష పడుతుందన్న నమ్మకం నాకు లేదు" అని కవిత వ్యాఖ్యానించారు.

## సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలి.. గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు



హైదరాబాద్ : సింగరేణిలో బొగ్గు స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్రసమితి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు లోక్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం బీఆర్ఆర్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చాం. ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లో వణుకు మొదలైంది. కుంభకోణాన్ని బట్టబయలు చేశాక పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరిట ఒక్కొక్కరిని పిలుస్తున్నారు. సీఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావిస్తున్నారు. ఫుట్‌బాల్ ఆటకు రూ.10కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారు. స్కామ్‌ల విషయంలో పాలకుల నుంచి స్పష్టమైన జవాబు లేదు. ఓబీ టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో పారదర్శకతకు పాతరేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణి టెండర్లలో నిబంధనలు పెట్టారు. నిబంధన పెట్టిన 9 నెలల్లో ఎందరు కాంట్రాక్టర్లు సందర్శించారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. రింగ్ మాస్టర్ సృజన్‌రెడ్డి.. సీఎం బావమరిదేనా కాదా స్పష్టత ఇవ్వాలి. కాంట్రాక్టర్లను రింగ్ చేసి ప్రజాధనం దోపిడీకి యత్నిస్తున్నారు. ప్రభుత్వం రూ.వేల కోట్లు కొల్లగొడుతోందని సింగరేణి కార్మికులు గుర్తించాలి. సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలని గర్నవర్‌ను కోరాం" అని కేటీఆర్ తెలిపారు.




భారత్- యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పూర్తయింది. 18 సంవత్సరాల నిరీక్షణ తర్వాత భారతదేశం, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం వైన్, విస్కీ ప్రియులు, లగ్జరీ కార్ల అభిమానులకు ఆనందాన్ని ఇస్తోంది. ఈ ట్రేడ్ డీల్ ద్వారా భారతీయ వస్తువులకు యూరోపియన్ మార్కెట్ల తలుపులు తెరుచుకుంటాయి. యూరప్ నుంచి దిగుమతి అయిన వస్తువులు భారతదేశంలో చౌకగా లభిస్తాయి. ఈ ఒప్పందాన్ని 'అన్ని వాణిజ్య ఒప్పందాలకు తల్లి' అని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అభివర్ణించారు.

**భారత్‌లో వీటి ధరలు తగ్గుతాయి:** ప్రస్తుతం యూకే నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న స్కాచ్ విస్కీ, జిన్?పై 150 శాతం సుంకాలను విధిస్తున్నారు. తాజా ఒప్పందం నేపథ్యంలో ఆ సుంకాలు 20 శాతానికి తగ్గుతాయి. అయితే దీనిని వెంటనే కాకుండా 5-10 సంవత్సరాల కాల వ్యవధిలో అమలు చేస్తారు. దీంతో యూరప్‌నకు చెందిన ప్రీమియం జిన్‌లు, వైన్, వోడ్కాలు చౌకగా లభిస్తాయి. అలాగే భారతీయ మద్యానికి కూడా ఈయూ సభ్య దేశాలలో పన్ను మినహాయింపులు లభిస్తాయి. మెర్సిడెస్, బీఎమ్‌డబ్ల్యూ, ఆడి వంటి యూరోపియన్ కార్లకు ప్రస్తుతం 100 శాతం పన్నులు విధిస్తున్నారు. ఒప్పందం తర్వాత ఆ పన్నులు నిర్ణయించిన కాల వ్యవధిలో పది శాతానికి తగ్గుతాయి. అయితే రూ. 25 లక్షల కంటే తక్కువ ధరకు అమ్ముడుపోయే అవకాశం ఉన్న కార్లను మాత్రం భారత్‌కు ఈయూ ఎగుమతి చేయదు. భారత ఆటోమొబైల్ పరిశ్రమను రక్షించడానికి ఈ నిబంధన పెట్టారు. యూరప్ నుంచి దిగుమతి అయ్యే కేన్సర్, ఇతర తీవ్రమైన అనారోగ్యాల చికిత్సలో ఉపయోగించే మందుల ధరలు కూడా తగ్గుతాయి. అలాగే యూరప్ నుంచి భారత్ దిగుమతి చేసుకునే వైద్య పరికరాల ధరలు కూడా తగ్గుతాయి. యూరప్ నుంచి దిగుమతి చేసుకునే విమానాల విడి భాగాలు, మొబైల్ ఫోన్లు, హైటెక్ ఎలక్ట్రానిక్ వస్తువులపై సుంకాలు తగ్గుతాయి. ఇది భారతదేశంలో గాడ్జెట్ల తయారీ ఖర్చులను తగ్గిస్తుంది.

తుది వినియోగదారునికి ప్రయోజనం చేకూరుస్తుంది. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు చౌకగా లభించవచ్చు. ఇనుము, ఉక్కు, రసాయన ఉత్పత్తులపై సున్నా సుంకాల ప్రతిపాదన ఉంది. దీని వలన నిర్మాణ, పారిశ్రామిక రంగాలలో ముడి పదార్థాల ధరలు తగ్గుతాయి. అలాగే చాక్లెట్లు, సౌందర్య సాధనాలు, పలు గృహోపకరణాలు కూడా గతంలో కంటే చౌకగా లభిస్తాయి. ఇక, భారత్?లో తయారయ్యే వస్త్రాలు, పాదరక్షలు, ఆటో భాగాలు, రత్నాలు, ఆభరణాలు, ఫర్నిచర్, క్రీడా వస్తువులు, రసాయనాలు, యంత్ర పరికరాలపై ఈయూ పన్నుల నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ మేరకు భారతీయ వస్త్ర, ఫుట్?వేర్, ఆటో మొబైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల సంస్థలు భారీగా లాభపడనున్నాయి.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com